
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 18 డిసెంబరు 2024



ఏపీజీవీబీ ఇక టీజీబీ

» మహ్మద్ రియాజ్, ఖమ్మం రీజనల్ మేనేజర్

ప్రశ్న: ఏపీజీవీబీ పేరు మారుస్తున్నారా?
జవాబు: అవును. జనవరి 1నుంచి ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ పేరు ఉండదు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) పేరుతో సేవలందిస్తున్నాం. తెలంగాణలోని 493 ఏపీజీవీబీ బ్యాంకులు తెలంగాణ గ్రామీణ బ్యాంకులోకి విలీనం అవుతున్నాయి.
ప్ర: పేరు మార్పు వల్ల ఖాతాదారులకు అదనపు ప్రయోజనాలు అందుతాయా?
జ: అలాంటిదేమీలేదు. ఇప్పుడున్న సేవలు యథావిధిగా కొనసాగుతాయి. తెలంగాణ రాష్ట్రంలో ఏపీ పేరుతో బ్యాంకు కొనసాగడం కంటే తెలంగాణ పేరుతో ప్రజల మనోభావాలకు అనుగుణంగా బ్యాంకు సేవలందించాలని ఈమార్పు జరిగింది. ఖమ్మం జిల్లాలో 64 బ్రాంచీల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంకులుగా బోర్డులుకూడా మారుస్తున్నాం.
ప్ర: బ్యాంకు సేవలకు తాత్కాలికంగా ఏమైనా ఇబ్బందులున్నాయా?
జ: ఈ మార్పుల కారణంగా ఈనెల 28నుంచి 31వరకు ఖాతాదారులకు బ్యాంకు సేవలు నిలిచిపోతున్నాయి. ఏటీఎంలు, ఆన్‌లైన్ నెట్‌బ్యాంకింగ్, డీడీలు, చెక్కులుసేవలు ఆగిపోతున్నాయి. ఇప్పటికే ఈ సమాచారాన్ని మెసేజ్‌ల ద్వారా అందించాం. ఎవరికైనా అవసరం ఉంటే ముందే ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసుకోవచ్చు.
ప్ర: ఏపీజీవీబీ పేరుతో ఉన్న చెక్‌బుక్‌లు, ఏటీఎం డెబిట్ కార్డులు పనిచేస్తాయా?
జ: ప్రస్తుతానికి పనిచేస్తాయి. కానీ ప్రతి ఖాతాదారుడు కూడా కొత్త పాస్‌పుస్తకం తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరుతో చెక్‌బుక్, ఏటీఎం కార్డులు అన్నీ మార్చుకోవాల్సి ఉంటుంది. జనవరి 1నుంచి ఈ మార్పులతో ఖాతాదారులకు సేవలందించడం జరుగుతుంది.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం.

అప్పుడలా.. ఇప్పుడిలా..

సత్తుపల్లి జిల్లా ఏర్పాటు కలగానే మిగిలే పరిస్థితి కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి వినిపించిన భిన్న ప్రకటనలే ఇందుకు సాక్ష్యంగా కనిపిస్తోంది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో సత్తుపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంకగాంధీ హామీ ఇచ్చారు. కానీ తాజాగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాత్రం కొత్తజిల్లాల ఏర్పాటు ప్రతిపాదన పరిశీలనలో లేదని ప్రకటించడం గమనార్హం. సత్తుపల్లి కేంద్రంగా సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజల నుంచి డిమాండ్ ఉంది. 2016 అక్టోబరు నుంచి 129 రోజుల పాటు సత్తుపల్లిలో జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు సైతం చేశారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 180 పంచాయతీల నుంచి తీర్మానాలు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. కానీ ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు.



» సత్తుపల్లి జిల్లా ఏర్పాటుపై అధికార పార్టీ ద్వంద్వ వైఖరి
» ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ప్రియాంకగాంధీ
» కొత్త జిల్లాల ప్రతిపాదన లేదన్న మంత్రి పొంగులేటి
» భిన్న ప్రకటనలపై సత్తుపల్లి ప్రాంతవాసుల్లో అసంతృప్తి

సత్తుపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా రాజకీయ పార్టీలు సత్తుపల్లి కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటుపై పోటీపడి హామీ ఇచ్చాయి. ప్రధానంగా కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, పీసీసీ బాధ్యులు, ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహా అప్పట్లో ప్రతి ఒక్కరూ జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యం రాగానే సత్తుపల్లి జిల్లా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అఖరికి కల్లూరులో జరిగిన ఎన్నికల సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సత్తుపల్లి జిల్లా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ శాసనమండలిలో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, తక్కెళ్లపాటి రవీందర్‌రావులు అడిగిన ప్రశ్నకు మంత్రి పొంగులేటి సమాధానం ఇస్తూ ఇప్పటికే ఉన్న జిల్లాల రద్దు ఉండదని, అలాగే కొత్త జిల్లాల ఏర్పాటు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో లేవని బదులివ్వటంతో సత్తుపల్లి ప్రాంత ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు.

గతంలో ఆందోళన

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2016లో జిల్లాల పునర్విభజన చేసి కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాను విభజించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పట్లోనే సత్తుపల్లి కేంద్రంగా సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరారు. 2016 అక్టోబరు నుంచి 129రోజుల పాటు సత్తుపల్లిలో జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు చేశారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 180 పంచాయతీల నుంచి తీర్మానాలు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. కానీ ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. తరువాత జిల్లా ఏర్పాటు డిమాండ్ కొంతకాలం తెరమరుగైంది. అప్పట్లో ఆందోళనల్లో పాల్గొన్న వారిపై కేసులు నమోదు కాగా ఆ కేసులను కోర్టులు కొట్టివేశాయి. ఇదిలా ఉండగా జిల్లా సాధన కోసం ఉద్యమాలు చేసిన వారు ఎక్కువ మంది బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల్లోనే ఉండడం గమనార్హం.



జిల్లా సాధన జేఏసీ సభలో మాట్లాడుతున్న పొంగులేటి (ఫైల్)



ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నాం
డాక్టర్ మట్టా రాగమయి, ఎమ్మెల్యే, సత్తుపల్లి

గత ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సత్తుపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు ప్రయత్నిస్తూనే ఉన్నాం. సీఎం రేవంత్‌రెడ్డికి కూడా వినతిపత్రం అందజేశాం. జిల్లా ఏర్పాటు కోసం ప్రజల ఆకాంక్షను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. సత్తుపల్లి వాసుల డిమాండ్‌ను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ఆకాంక్షను నెరవేరుస్తాం.



హామీ ఇచ్చి మరిచారు
కూకలకుంట రవి, జిల్లా సాధన కన్వీనర్

2016లో కోసం దీక్ష చేస్తే ఆనాడు ఎంపీగా ఉన్న నేటి మంత్రి పొంగులేటి నిమ్మరసం ఇచ్చి సత్తుపల్లి జిల్లా ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కానీ నేడు ఆయనే కొత్త జిల్లాల ఏర్పాటు ప్రతిపాదన లేదని మాట్లాడటం విడ్డూరంగా ఉంది.

కొండెక్కిన కోడిగుడ్డు

» హోల్‌సేల్ ధర రూ.7పైన.. రిటైల్ రూ.8



అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోడి గుడ్డు ధర కొండెక్కింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధర పలుకుతోంది. చలికాలంలో ధరలు పెరగటం సాధారణమే అయినా ఈస్థాయిలో పెరిగిన దాఖలాలు లేవని వ్యాపారవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పెరిగిన ధరలతో గుడ్డు ప్రియులకు గుడ్డు కొనుగోలు భారంగా మారింది. కొద్దిరోజుల్లో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు ఉన్నాయి. వేడుకలకు అవసరమైన కేకుల తయారీలోనూ కోడి గుడ్ల వినియోగం భారీగానే ఉంటుంది. దీంతో వ్యాపారులు ఇబ్బంది పడే పరిస్థితి. పండుగలు ఉన్నందున ధరలు ఇదేమాదిరిగా ఉండే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. ఇక నిత్యం పాఠశాలల్లో, గురుకులాల్లో, ఆశ్రమాల్లో కోడిగుడ్డు వినియోగం ఉంటుంది. పెరిగిన ధరల ప్రభావం మధ్యాహ్న భోజనంపైనా పడే అవకాశముందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నాలుగు నెలల క్రితం రూ.5 వరకు ఉన్న ప్రస్తుతం హోల్‌సేల్‌గానే రూ.7పైన పలుకుతోంది. ఆగస్టు నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చిన ధర డిసెంబరు నాటికి భారీగా పెరిగింది. హోల్‌సేల్ వ్యాపారులు 30 గుడ్ల అట్టను రూ.210కి విక్రయిస్తుంటే దానిని కొనుగోలు చేసే చిరువ్యాపారులు ఒక్కో గుడ్డును రూ.8వరకు విక్రయిస్తున్నారు.

భోజనం చాలా బాగుంది..

» మెస్ నిర్వాహకురాలికి కలెక్టర్ కితాబు


కారేపల్లిలో మురళి మెస్‌లో భోజనం చేస్తున్న ఖమ్మం కలెక్టర్

కారేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి బసాండ్ సెంటర్‌లోని మురళి మెస్‌లో మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ భోజనం చేసి 'భేష్...' అని కితాబునిచ్చారు. స్వయం సహాయక సంఘం సభ్యురాలైన గంగరబోయిన లక్ష్మీకాంతమ్మ... ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల రుణం పొంది మురళి మెస్ పేరుతో హోటల్ నిర్వహిస్తోంది. ప్రభుత్వ రుణాల ద్వారా ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్.. మురళి మెస్‌ను పరిశీలించారు. అనంతరం మెస్‌లో భోజనం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు లక్ష్మీకాంతమ్మను కలెక్టర్ అభినందించారు. 'భోజనం చాలా బాగుందమ్మా... పగలు నేను భోజనం చేయను... కానీ మీ మెస్ చూడగానే భోజనం చేయాలనిపించింది... చాలా బాగుంది.. రుచి, శుచితో కస్టమర్లను ఆకట్టుకోవాలి..' అని సూచించారు. కలెక్టర్‌తో పాటు ఏపీడీ నూరొద్దీన్ కూడా భోజనం చేశారు. ఈ సందర్భంగా ఫోన్‌పే ద్వారా బిల్లు చెల్లించారు. బ్యాంకు లింకేజీల ద్వారా లబ్ధిపొంది మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఐదు యూనిట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. మహిళలు స్వయం సహాయక సంఘల ద్వారా మరింత బలోపేతం కావాలని కోరారు.


భూమి పత్రాలను సొసైటీ సభ్యులకు అందజేస్తున్న చైర్మన్ బత్తినేని

భళా... 'బత్తినేని' దాతృత్వం!

నారాయణపురం సొసైటీకి రూ.30 లక్షల భూమి వితరణ

బోనకల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పదవులను కొందరు అలంకారంగా భావిస్తుంటారు. వాటిని ఉపయోగించుకొని అన్ని విధాలా స్థిరపడాలనుకుంటారు. కానీ మరికొందరు మాత్రం నిస్వార్థంగా వ్యవహరించి తమ పదవులకు వన్నె తీసుకువస్తారు. బోనకల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన బత్తినేని నాగప్రసాదరావు ఈ కోవలోకే వస్తారు. ఐదు సంవత్సరాల క్రితం చిన్నబీరవల్లి, నారాయణపురం గ్రామాలకు సంబంధించి నారాయణపురం సొసైటీ చైర్మన్‌గా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీలో మొత్తం 865 మంది సభ్యులుండగా రూ.5.63 కోట్ల టర్నోవర్‌తో లాభాల బాటలో పయనిస్తున్నది. ప్రస్తుతం ఉన్న సొసైటీ కార్యాలయానికి ఎరువులు, విత్తనాల లోడ్లతో లారీలు వచ్చే అవకాశం లేక పోవడంతో ఆ సమస్యను తీర్చేందుకు నాగప్రసాదరావు చొరవ తీసుకున్నారు. గ్రామంలో 75 సెంట్ల భూమిని సొంతంగా రూ.30లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ పత్రాలను మంగళవారం సొసైటీ సభ్యులకు అందజేశారు. తాను దానమిచ్చిన భూమిలో వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకొనేందుకు గోడౌన్‌ను, సొసైటీ కార్యాలయాన్ని నిర్మించేందుకు కృషిచేస్తానని తెలిపారు. నాగప్రసాదరావు బత్తినేని చారిటబుల్ ట్రస్టు స్థాపించి తన కుమారుల ద్వారాసేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

బోనస్ కోసం.. బోర్డర్ దాటి..


ఆంధ్రా నుంచి తెలంగాణలోకి వస్తున్న ధాన్యం లారీలు

» ఏపీ నుంచి అక్రమంగా సన్నధాన్యం దిగుమతి
» అనుమతి లేకపోయినా సన్నధాన్యానికి పచ్చజెండా
» ప్రభుత్వ శాఖల మధ్య కొరవడిన సమన్వయం
» చెక్‌పోస్టుల వద్ద ఉమ్మడి నిఘా కరవు
» సెస్ తీసుకొని అనుమతిస్తున్న మర్కెటింగ్ శాఖ
» ఫైన్ వేసి లారీలను వదులుతున్న పోలీసు శాఖ
» సర్కార్ మార్గదర్శకాలకు తిలోదకాలు

ఖమ్మం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో సన్నధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుండడంతో ఏపీలోని కొందరు వ్యాపారులు ఈ బోనస్‌పై కన్నేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ధాన్యాన్ని రాష్ట్రానికి రానివ్వొద్దని ప్రభుత్వం ఆదేశించినా జిల్లాస్థాయిలో అధికారుల మధ్య సమన్వయలోపంతో ఏపీ నుంచి సన్నధాన్యం యథేచ్ఛగా దిగుమతి అవుతోంది. ఒక శాఖ సన్నబియ్యం తీసుకురావొద్దని హెచ్చరిస్తుంటే మరోశాఖ తమకు సెస్ చెల్లించి తీసుకెళ్లొచ్చని అనుమతి ఇస్తోంది. ఇదే అదునుగా పొరుగు రాష్ట్రాల వ్యాపారులు సన్న ధాన్యాన్ని యథేచ్ఛగా ఇక్కడి మిల్లులకు తరలిస్తున్నారు. జిల్లాలోని వల్లభి, చెరువుమాధారం వద్ద ఆదివారం పట్టుబడ్డ 91లారీల విషయంలోనూ అధికారుల మధ్య సమన్వయలోపం బయటపడింది.

బోనస్ కోసం బరితెగింపు..

జిల్లాలో సివిల్ సప్లయిస్, మార్కెటింగ్, పోలీసు, రెవెన్యూ శాఖల మధ్య ఉన్న సమన్వయలోపం వ్యాపారులకు వరంలా మారింది. జిల్లాస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పుడే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఏపీ, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి ధాన్యాన్ని ఇక్కడకు తరలించి బోనస్ పొందే ప్రయత్నాలు జరుగుతాయని అనుమానించి ఉమ్మడి సమావేశాలు నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం, పొరుగు రాష్ట్రాలనుంచి వచ్చే సన్నధాన్యంపై నిఘా ఉంచి అడ్డుకోవడం వంటి చర్యలు తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల సన్నధాన్యం తెలంగాణకు తీసుకొస్తే కేసులు పెట్టాలని కూడా ప్రభుత్వం సూచించింది. కానీ జిల్లాలో ఇందుకు భిన్నమైన పరిస్థితులున్నాయి. గత పదిరోజులుగా ఏపీలోని కృష్ణా, గుంటూరు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన సన్నధాన్యాన్ని తెలంగాణలోని

(మిగతా 6వ పేజీలో)



సన్నాల సాగుకే సై...

» యాసంగిలో దొడ్డురకం బదులు సన్నాల వైపు రైతుల మొగ్గు
» రూ.500 బోనస్ ఫలితం

ఖమ్మం వ్యవసాయం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాధారణంగా యాసంగిలో రైతులు దొడ్డురకం ధాన్యం సాగుచేస్తారు. కానీ, ఈ యాసంగిలో సన్న వడ్ల సాగుకే సై అంటున్నారు. వానాకాలం సాగుచేసిన సన్నాలకు ప్రభుత్వం క్వింటాళుకు రూ.500 బోనస్ ఇచ్చింది. సన్నాలకు బోనస్ కొనసాగుతుందని సీఎం ప్రకటించారు. దీంతో యాసంగిలోనూ సన్నవడ్ల సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రైవేట్ కంపెనీల విత్తనాలు కొని నార్లు పోసుకుంటున్నారు.

(మిగతా 6వ పేజీలో)


స్వామివారి పూజలో పాల్గొన్న శ్రీరామదీక్షితులు

శ్రీరామదీక్షితుల పునర్వసు దీక్ష విరమణ

» భక్తి ప్రపత్తులతో గిరి ప్రదక్షిణ » నేడు శ్రీరామ పట్టాభిషేకం

భద్రాచలం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామపునర్వసు దీక్ష విరమణ కార్యక్రమాన్ని మంగళవారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. శ్రీరామదీక్షితులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి సీతారామచంద్రస్వామి సన్నిధికి చేరుకొని నిత్య కల్యాణ మండప వేదిక వద్ద అర్చకస్వాములచే విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తరం నిర్వహించి తిరువడి (ఇరుముడి)ధారణ గావించారు. అనంతరం దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్ శ్రీరామపాదుకలను శిరస్సుపై ధరించి భద్రగిరి ప్రదక్షిణ నిర్వహించారు. చివరగా స్వామి వారి సన్నిధిలో తిరువడిని శ్రీరామదీక్షితులు సమర్పించారు. అనంతరం బేడా మండపం వద్ద నిర్వహించిన సంక్షేప రామాయణ హవనంలో శ్రీరామదీక్షితులు పాల్గొన్నారు. రాత్రి శ్రీరామదీక్షితుల కోసం వెండిరథ సేవను రామయ్యకు నిర్వహించారు. బుధవారం శ్రీరామదీక్షితుల కోసం స్వామి వారికి శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించనున్నారు. శ్రీరామదీక్షితుల కోసం దేవస్థానం అధికారులు అన్నదానం ఏర్పాట్లు చేశారు. శ్రీరామ పునర్వసు దీక్ష 27 రోజులు కొనసాగగా మంగళవారం విరమణ గావించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



» చిన్న కుమారుడిపై అనుమానం » అదుపులోకి తీసుకున్న పోలీసులు » ఖమ్మం ఖానాపురంలో ఘటన

ఖమ్మం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో మంగళవారం మధ్యాహ్నం ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమెను కుమారుడే హత్య చేసి ఉంటాడనే అనుమానంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఖమ్మం నగరంలోని 7వ డివిజన్ ఖానాపురంలోని బొడ్రాయి సెంటర్‌కు చెందిన కొప్పెర లక్ష్మీనారాయణ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయన భార్య శ్రీవాణి(43) గృహిణి. వారికి త్రినాథ్, గోపినాథ్ అనే ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు త్రినాథ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా చిన్న కుమారుడు గోపినాథ్ కొద్ది రోజులుగా మద్యానికి బానిసై కూలి పనులకు వెళుతూ తిరుగుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో శ్రీవాణి ఇంటి నుంచి పాలు మాడిన వాసన రావడంతో పక్కనే నివాసం ఉండే రేణుక అనే మహిళ అక్కడికి వెళ్లింది. ఆ సమయంలో బెడ్‌పై ఆమె పడుకుని ఉండగా లేపే ప్రయత్నం చేయడంతో లేవలేదు. దీంతో స్థానికులను పిలవగా వారు వచ్చి చూసి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతురాలి భర్త లక్ష్మీనారాయణకు సమాచారం అందించారు. మృతురాలి ఒంటిపై బంగారు గొలుసు, చెవిదిద్దులు ఎవరో తీసుకెళ్లినట్లు మచ్చలు ఉండటంతో దొంగలు చోరీ చేశారేమోనని అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి జాగీలాలతో వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకు తరలించారు.

గత నాలుగు రోజులుగా డబ్బులు కావాలని చిన్న కుమారుడు గోపినాథ్ తల్లిదండ్రులతో గొడవపడుతున్న విషయం పోలీసులకు తెలిసింది. వారం క్రితం అతడు తల్లితో గొడవపడి కొట్టినట్టు స్థానికులు పోలీసులకు తెలిపారు. శ్రీవాణి భర్త లక్ష్మీనారాయణ తన భార్య మృతిపై అనుమానం ఉందని, చిన్న కుమారుడిపై కూడా అనుమానం ఉందని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా గోపీనాథ్ ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లి మృతదేహం ఉంచిన మార్చురీ వద్దకు రాగా, కుటుంబ సభ్యులు ఆగ్రహంతో అతడి వద్దకు వెళుతుండగా పోలీసులు అడ్డుకొని గోపినాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఖనాపురంహవేలి సీఐ భానుప్రకాష్‌ను వివరాలు కోరగా మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చిన్నకుమారుడు గోపినాథ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యమా? ఎలుక కాటా?

» బీసీ గురుకులంలో టెన్త్ విద్యార్థినికి అస్వస్థత
» ఫిబ్రవరిలో హాస్టల్‌లో ఎలుక కాటు
» అనారోగ్యానికి అదే కారణమంటున్న తల్లిదండ్రులు
» రెండేళ్లుగా బాలికకు అనారోగ్య సమస్యలున్నాయన్న ప్రిన్సిపాల్
» విచారణకు ఆదేశించిన ఖమ్మం కలెక్టర్



ఖమ్మం ఖానాపురం హవేలి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ఓ గురుకుల విద్యార్థిని అనారోగ్యం పాలవ్వడం వివాదాస్పదమైంది. నగరంలోని ముస్తఫానగర్‌కు చెందిన లక్ష్మీభవాని దానవాయిగుడెంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులంలో 10వ తరగతి చదువుతోంది. అయితే బాలిక ఈ నెల 11న అనారోగ్యం బారినపడి నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గురుకులంలో ఉంటున్న లక్ష్మీభవాని కాళ్లకు వాపు రావడంతో ప్రిన్సిపాల్ నాగమణి బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దాంతో వారు వచ్చి తమ కుమార్తెను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో బాలిక ఒక చేయి, ఒక కాలుకు స్పర్శ కోల్పోయింది. తమ కుమార్తె అనారోగ్యానికి గురుకులంలో గతంలో ఎలుక కరవడమే కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. (మిగతా 6వ పేజీలో)



ఎస్‌ఐ సంతోష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న పోలీస్ కమిషన్ సునీల్‌దత్

సిబ్బంది పనితీరుపై సీపీ ఫిదా

- నేలకొండపల్లి పోలీసులకు అభినందనలు
- వృద్ధ దంపతుల కేసు ఛేదించిన సిబ్బందికి జ్ఞాపికలు
- పోలీసుల ప్రతిష్టను పెంచారని ఉన్నతాధికారి కితాబు

నేలకొండపల్లి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గత నెల 26న నేలకొండపల్లిలో జరిగిన వృద్ధ దంపతుల జంట హత్యలను ఛేదించిన పోలీసులను ఖమ్మం సీపీ సునీల్‌దత్ అభినందించారు. మంగళవారం సీపీ సునీల్‌దత్ నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, జనరల్ డైరీ, రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గత నెలలో నేలకొండపల్లిలో జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసును ఛాలెంజ్‌గా తీసుకుని, కొద్ది రోజుల్లోనే హంతకులను పట్టుకున్న పోలీస్ సిబ్బందికి జ్ఞాపికలను అందచేశారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించి, పకడ్బందీ ప్రణాళికతో హత్యలు జరిగిన అనతి కాలంలోనే సమర్ధవంతంగా పోలీసులు ఛేదించడం అభినందనీయమన్నారు. జంట హత్యల కేసును సవాల్‌గా తీసుకుని పని చేసిన పోలీస్ సిబ్బంది హంతకులను పట్టుకుని పోలీసు ప్రతిష్ఠను పెంచటంతో పాటుగా, ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంచారని కొనియాడారు. సరిహద్దుల నుంచి అక్రమంగా ధాన్యం తెలంగాణాలోకి రావటాన్ని నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించటంతో పాటుగా వాహన తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. స్టేషన్‌హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల బాధ్యతలు, రెగ్యూలర్ రోల్‌కాల్ విధిగా అమలు చేయాలని సూచించారు. పాత నేరస్థుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐలు సంజీవ్, మురళి, ఎస్ఐలు సంతోష్, జగదీష్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లకు సముచిత స్థానం కల్పిస్తాం

- పెన్షనర్ల దినోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు సామాజికంగా సముచిత స్థానం కల్పిస్తామని, విధినిర్వహణలో వారు అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులసంఘం ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో భక్త రామదాసు కళాక్షేత్రంలో జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య అధ్యక్షతన పెన్షనర్స్ డే ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. పెన్షనర్ల ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సీనియర్ పెన్షనర్లను కలెక్టర్ సన్మానించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్ బాబు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వం పెన్షనర్లను తీవ్ర ఆవేదనలకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు , పెన్షనర్లకు ప్రజలకు అనేక రాయితీలు కల్పిస్తామని ఎన్నికల వాగ్దానం చేసి వాటిని అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. కరువు భత్యం, పే రివిజన్ కమిటీ ప్రయోజనాలు కల్పించకుండా, ఉద్యోగ విరమణ చెందిన రోజునే అన్ని ప్రయోజనాలు కల్పిస్తామని తెలిపి దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఈ సదస్సులో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ ప్రయోజనాలు కల్పించకపోగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ పెన్షనర్లకు ఇబ్బందులు కలిగే చర్యలను అమలుచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య కార్డులను అందించి ఆ సేవలను కార్పొరేట్ దవాఖానాలలో అమలయ్యేలా చూడాలని కోరారు.

జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీఎస్ నర్సింహం మాట్లాడుతూ పెన్షనర్ల ప్రయోజనాలను జాప్యం లేకుండా ప్రతి నెల మొదటి తేదీనే పెన్షన్లు విడుదల చేస్తున్నామని, బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే చర్యలు తీసుకుంటామని పెన్షనర్లకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి మోదుగు వేలాద్రి, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు వెలిగేటి చంద్రమోహన్, జిల్లా ఆరోగ్యఅధికారి నారాయణమూర్తి, రిటైర్డ్ ఉద్యోగ సంఘ జిల్లా నాయకులు తాళ్లూరి వేణు, టి.జనార్దన్, సాంబశివరావు, దుర్గాదేవి, రఘుపతి రెడ్డి, ఖాజామొహినుద్దీన్ , ఎస్.పూర్ణచంద్రరావు, సి.బాబురావు, టి.జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూతురు కృష్ణమూర్తి, గణపతి రాజు, సత్యానందం పాడిన పాటలు ఉర్రూతలూగించాయి.



లగచర్ల గిరిజన రైతులకు న్యాయం జరగాలంటూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

లగచర్ల గిరిజన రైతుల పట్ల ప్రభుత్వ తీరు అమానుషం

- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మంటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లగచర్ల గిరిజన రైతులపట్ల ప్రభుత్వం అమానుషంగా ప్రవరిస్తోందని, అక్రమ కేసులు బనాయించటమే కాకుండా చేతికి సంకెళ్లు వేసి అవమానిస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు లగచర్ల గిరిజన రైతులకు న్యాయం జరగాలంటూ బీఆర్ఎస్ నేతలు మంగళవారం నగరంలోని జడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ లగచర్ల రైతులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకుంటే గిరిజన రైతుల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు దాదె అమృతమ్మ, షేక్ మక్బూల్, పల్లా రోసిలీనా, దండా జ్యోతిరెడ్డి, బుర్రి వెంకట్, నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, మాటేటి నాగేశ్వరరావు, బిచ్చాల తిరుమలరావు, ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, వీరూనాయక్, సురేష్, షకీనా తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంటరీ చిత్రీకరణ బృందాల పర్యటన

కొత్తగూడెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైన్ వాటర్ టీం, స్టూడియో పంచతంత్ర బృందాలు మూడో రోజు మంగళవారం బెండాలపాడు, కనిగిరి గుట్టల్లో పర్యటించాయి. డాక్యుమెంటరీ చిత్రీకరణ కోసం సభ్యులు చంద్రుగొండ మండలం బెండాలపాడు, పాలకోయలొద్ది వీరభద్ర స్వామి దేవాలయంను సందర్శించారు. గుట్టచుట్టు నిర్మించిన 15అడుగుల ఎత్తున్న రాతిగోడను పరిశీలించారు. కాకతీయులు తాగునీటికి ఉపయోగించే ఏడాది పొడవున నీరు ఉండే కోనేరులో మంచినీటిని తాగి పరిశీలించారు. పలు ప్రాంతాలను, వినియోగ సామగ్రిని వీడియోలో చిత్రీకరించారు. రైన్‌వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ సీఈవో కల్పన రమేష్ మాట్లాడుతూ జిల్లాలో మూడు రోజుల పర్యటన ముగిసిందన్నారు. కాకతీయుల కట్టడాలు, ప్రకృతిఅందాలు ఆనందాన్ని ఇచ్చాయన్నారు.



అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన దేవస్థానం ఉద్యోగులును అడ్డగిస్తున్న దృశ్యం

రామయ్య భూములకు రక్షణ కరవు

- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆక్రమణలో 1,149.70 ఎకరాలు
- పురుషోత్తపట్నంలోనే 889 ఎకరాలు ఆక్రమణ
- దేవస్థానం ఆధీనంలో ఉన్నది కేవలం 41.67 ఎకరాలే ..

భద్రాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామయ్యకు భూములకు రక్షణ కరవైంది. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో దృష్టిసారించకపోవడంతో ఆక్రమణలో ఉన్న భూములు రామయ్యపరం కావడం లేదు. భద్రాద్రి దేవస్థానానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని 8జిల్లాల్లో 1,347.27 ఎకరాల భూమి ఉంది. ఇందులో 1,149.70 ఎకరాలు ఆక్రమణలో ఉంది. దేవస్థానం ఆధీనంలో ఉన్న స్థలం 41.67 ఎకరాలు మాత్రమే ఉంది. కేవలం పురుషోత్తపట్నంలోనే 889 ఎకరాల భూమి ఆక్రమణలో ఉందని దేవస్థానం వర్గాలు పేర్కొంటుండటం గమనార్హం. గత ఏపీ ప్రభుత్వ హయాంలో ఈ ఆక్రమణల పర్వం మరింత తారస్థాయికి వెళ్లి గత ఐదేళ్లలో సుమారు 45 ఇళ్ల వరకు పూర్తవడం, వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని దేవస్థానం వర్గాలు వాపోతున్నాయి.

భూములకు రక్షణేది .

ఇష్టానుసారంగా ఆక్రమణలు చేపట్టినా గతంలో అధికారుల వ్యవహార తీరుతో పరిస్థితి జటిలంగా మారిందనే విమర్శలు లేకపోలేదు. ఇటీవల రెండేళ్లుగా దేవస్థానం అధికారులు ఆక్రమణలను అడ్డుకునేందుకు పలుమార్లు చేసిన ప్రయత్నాలు కొంత మేరకు సఫలమయ్యాయని చెప్పవచ్చు. హైకోర్టు ఉత్తర్వులు తమకు అనుకూలంగా ఉన్నా ఆక్రమణదారులు గతంలో విచ్చలవిడిగా గత ప్రభుత్వ హయాంలో వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. దేవస్థానం అధికారులు అప్పటి రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించినా వారి నుంచి ఆశించిన రీతిలో స్పందన లేదని రామ భక్తులు విమర్శిస్తున్నారు.

అయితే ఇటీవల రెండు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలువదీరగా ఈ ప్రభుత్వాలు ఇప్పటి వరకు రామాలయ భూములపై దృష్టిసారించలేదు.

పురుషోత్తపట్నంలోనే ఆక్రమణలో 889 ఎకరాల రామయ్య భూములు మొత్తం 1,347.27 ఎకరాలుండగా అందులో 1,149.70 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్లు దేవస్థానం అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. ఒక్క పురుషోత్తపట్నంలో 889.5 ఎకరాలు దేవస్థానానికి ఉండగా 889 ఎకరాలు ఆక్రమణ దారుల చేతుల్లోనే ఉందని దేవస్థాన వర్గాలు పేర్కొంటున్నాయి. దేవస్థానానికి నికరంగా 41.67 ఎకరాలు మాత్రమే దేవస్థానం ఆధీనంలో ఉండటం రామయ్య భూములకు రక్షణ లేదనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. సాంకేతికపరంగా రామయ్య భూములు అధికంగా ఏపీలో ఉండటంతో పాటు అక్కడి అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతోనే సమస్య జటిలమైందనే వ్యాఖ్యలు దేవస్థానం వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

భద్రాద్రి దేవస్థానం 110 ఎకరాల్లో గోశాలను నిర్వహిస్తుండగా వేదపాఠశాల, తులసివనం, పుష్పవనం తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతోంది. ఇందుకు ఆక్రమణదారుల నుంచి ప్రత్యక్షంగా పరోక్షంగా ఆటంకాలు తరచూ ఎదురవుతున్నాయని దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు. ఏడాది కాలంగా పలుమార్లు ఆక్రమణలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఉద్యోగులపై భౌతిక దాడులు సైతం స్థానికులు చేశారని దేవస్థానం వర్గాలు ఆరోపిస్తున్నాయి. రామయ్య భూముల్లో ఆక్రమణలపై సుమారు ఎనిమిదేళ్లుగా దేవస్థానం అధికారులు ఏపీ పరిధిలోని యటపాక పోలీసు స్టేషన్‌లో ఇప్పటి వరకు 50 ఫిర్యాదులు చేసినా ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదని అధికారులు పలుమార్లు విలేకర్లతో పేర్కొన్నారు.

సన్నాల సాగుకే సై..

(5వ పేజీ తరువాయి)

2 లక్షల ఎకరాల్లో వరి..

జిల్లాలో ఈ యాసంగిలో సుమారు 2 లక్షల ఎకరాలకు పైగా వరి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. 50వేల ఎకరా ల్లో దొడ్డు రకం ధాన్యం, 1.50లక్షల ఎకరాల్లో సన్నాలు సాగవుతాయని భావిస్తున్నారు. సాగు నీటివనరులు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో సన్నాల సాగు పెరిగే అవకాశం ఉందని కూడా భావిస్తున్నారు.

నార్లు పోస్తున్న రైతులు..

ఖమ్మం జిల్లాలో ఇప్పటికే సన్న వరి విత్తనాలు సేకరించుకుంటున్న రైతులు నార్లు పోసుకుంటున్నారు. ఆనవాయితీగా యాసంగిలో దొడ్డు రకం వడ్లు సాగు చేసేవారు కూడా ఈ పర్యాయం సన్న రకం వడ్లవైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది సన్న వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో సన్నరకం నార్లకు సిద్ధ అవుతున్నారు. జిల్లాలో చాలా మంది రైతులు సన్నాల సాగుకే సై అంటున్నారు.

డిమాండ్ ఉంటుందనే..

దొడ్డురకం ధాన్యం సాగుచేసి మిల్లర్లను బతిమిలాడే బదులు, భోజనానికి ఉపయోగించే సన్నరకం ధాన్యాన్ని సాగు చేస్తే కొంత మేర ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. సన్నరకానికి ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాల్లోనూ డిమాండ్ ఉండడంతో ఎగుమతి చేసే అవకాశం ఉంది. వడ్లకు మద్దతు ధర దక్కకపోతే. బియ్యంగా మార్చి విక్రయిస్తే మంచి ధర వస్తుంది. దీంతో రైతులు సన్నాల సాగుకే మొగ్గు చూపుతున్నారు.

ఎట్టకేలకు ఇద్దరు నకిలీలపై కేసు నమోదు

వైరా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో కల్యాణలక్ష్మీ సొమ్మును కాజేసేందుకు ప్రయత్నించిన ఇద్దరిపై ఎట్టకేలకు వైరా పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. వైరాకు సంబంధం లేని ఇస్లావత్ సోమ్లానాయక్, రోహిణి దంపతులకు కల్యాణలక్ష్మీ మంజూరు చేయించేందుకు నకిలీ పత్రాలు సృష్టించిన వైరాకు చెందిన పిల్లలమర్రి ఉపేందర్, భూక్యా వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు. ఈనెల 9వతేదీన రెవెన్యూ అధికారులు కల్యాణలక్ష్మీ లబ్ధిదారుల జాబితా తమకు వచ్చిన సమయంలో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది పరిశీలించగా ఈ నకిలీ బాగోతం వెలుగుచూసింది. ఆర్డీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మీ మంజూరు కాగా వెంటనే రెవెన్యూ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఫిర్యాదు మేరకు దాన్ని పెండింగ్‌లో పెట్టారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు ఆదేశాలతో గిర్దావర్ ఎం.వెంకటేశ్వరరావు ఈ నకిలీ వ్యవహారంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై ఈ నకిలీ బాగోతంలో ఎలాంటి కదలిక లేదని మంగళవారం 'ఆంధ్రజ్యోతి' సహా ఇతర పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఆ వెంటనే కలెక్టర్, ఖమ్మం సీపీ కార్యాలయాలు స్పందించి ఆదేశాలు జారీ చేయడంతో ఇద్దరిపై కేసు నమోదుచేశారు. ఈ నకిలీ బాగోతంలో మరికొంతమంది పాత్ర ఉందనే ఆరోపణలున్నాయి. గతంలో కూడా నకిలీ పత్రాలతో కల్యాణలక్ష్మీ సొమ్ము కాజేశారనే ఆరోపణలపై కూడా పూర్తిస్థాయి విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు. వైరా సీఐ ఎన్.సాగర్ ఆధ్వర్యంలో కేసు విచారణ జరుగుతుంది.

పట్టణంలో బీఆర్ఎస్ ప్రదర్శన

మణుగూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లఘుచర్లలో రాష్ట్ర ప్రభుత్వం రైతులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ మణుగూరు పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బారీ ప్రదర్శన నిర్వహించాయి. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ. ప్రశ్నించిన వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం తన అధికారం ద్వారా అక్రమ కేసులను బనాయించి జైళ్లల్లో నిర్బంధిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, కృష్ణ, లక్ష్మణ్, శ్రీనివాస్, రమేష్, ప్రభుదాస్, మర్రి మల్లారెడ్డి, నవీన్, అప్పారావు, రమాదేవి, రమా, మునికోటి ప్రమీల, కౌర్ సాగర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అనారోగ్యమా? ఎలుక కాటా?

(5వ పేజీ తరువాయి)

బాలిక అనారోగ్యంపై తల్లిదండ్రులు, గురుకలం ప్రిన్సిపాల్‌కు ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు. గురుకలంలో 10వ తరగతి చదువుతున్న లక్ష్మీభవానిని ఈ ఏడాది ఫిబ్రవరిలో హాస్టల్‌లో ఓ ఎలుక కరిచింది. అయితే ఎలుక కరవడం వల్లనే తమ కుమార్తెకు అనారోగ్య సమస్యలు ప్రారంభమై నేడు ఓ కాలు, చేయి స్వర్శ లేకుండా పోయిందని తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. గురుకులంలో మూత్రశాలలు సరిగా లేకపోవటంతో పాటు హాస్టల్ ప్రాంగణంలో నిత్యం కోతులు, ఎలుకలు తిరుగుతూ విద్యార్థినులపై దాడి చేస్తున్నాయని వాపోయారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవటంతోనే పలువురు బాలికలు అనారోగ్యం పాలవుతున్నారని తల్లితండ్రులు తెలిపారు.

ఆమెకు అనారోగ్య సమస్యలున్నాయి: ప్రిన్సిపాల్

ఈ విషయంపై గురుకులం ప్రిన్సిపాల్ నాగమణి మాట్లాడుతూ విద్యార్థిని లక్ష్మీభవానిని ఫిబ్రవరిలో ఎలుక కరిచిన మాట వాస్తవమేనని, అయితే ఈ విషయం వెంటనే బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వచ్చి ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి రెండు డోసుల రేబిస్ ఇంజక్షన్ వేయించారని, ఆ తరువాత కోలుకున్న బాలిక ఎప్పటిలాగే పాఠశాలకు వస్తోందని తెలిపారు. 2019లో గురుకులంలో చేరిన లక్ష్మీభవాని రెండేళ్లుగా(8వ తరగతి నుంచి) అనారోగ్య సమస్యలతో పాఠశాలకు సరిగా రావడం లేదని, ఈ క్రమంలో గత ఏడాది హాస్టల్‌లో ఉండకుండా ఇంటి నుంచే పాఠశాలకు వచ్చేందుకు అనుమతి తీసుకుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సంవత్సరం 10 తరగతి కావడంతో ఇంటి నుంచి వచ్చేందుకు ఆమెకు అనుమతి ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో లక్ష్మీభవాని ఉత్సాహంగా పాల్గొన్నదని ప్రిన్సిపాల్ తెలిపారు. డిసెంబరు 11న విద్యార్థినికి కాళ్ల వాపు రావడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని వారు వచ్చి వెంటనే బాలికను ఇంటికి తీసుకెళ్లారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఘటనపై విచారణకు కలెక్టర్ ఆదేశం

గురుకులంలో విద్యార్థిని అనారోగ్యం బారిన పడ్డ విషయం తెలుసుకున్న ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఈ ఘటనపై వెంటనే విచారణ చేసి నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సదరు అధికారులు గురుకులంలో విచారణ చేపట్టినట్లు తెలిసింది. గురుకులంలోని మూత్రశాలలు, వంటగది డైనింగ్‌హాల్ తదితర ప్రాంతాలను వారు పరిశీలించి విద్యార్థిని అనారోగ్యం బారిన పడిన ఘటనపై పలు అంశాలను అడిగినట్లు సమాచారం.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు

జమిలి వెనుక నియంత పాలన కుట్ర

- ఏడాది పొడవునా సీపీఐ శతవసంతాల సంబురాలు
- సీపీఐ జాతీయసమితి సభ్యుడు బి.హేమంతరావు

ఖమ్మం టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియంతృత్వం వైపు ప్రధాని మోదీ ఆలోచనలు సాగుతున్నాయని, అందుకే జమిలి ఎన్నికలు పెట్టాలని కుట్ర పన్నుతున్నారని సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యలయంలో పాలేరు, ఖమ్మం నియోజకవర్గాలు, చింతకాని, కొణిజర్ల మండలాల సీపీఐ నేతల సంయుక్త సమావేశం నిర్వహించారు. మహమ్మద్ సలాం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు జమిలి ఎన్నికల్లో మతోన్మాదం ద్వారా లబ్దిపొందాలని చూస్తున్నాయని, ఇది దేశ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. గత 11 ఏళ్లుగా బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నదని, దేశాన్ని తామే శాశ్వతంగా పరిపాలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ప్రజాస్వామిక దేశంలో జమిలి ఎన్నికలు ప్రజాభిప్రాయాన్ని తెలుపలేవన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించిందని, భవిష్యత్తులోనూ ఇవి కొనసాగిస్తామని తెలిపారు. ఈ నెల 26వ తేదీన సీపీఐ శతవసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఏడాది పొడవునా సంబురాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా 26వ తేదీన ఖమ్మంలో రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు, వేలాదిమందితో ప్రదర్శన ఉంటుందన్నారు. వందేళ్ల పోరాట చరిత్ర, సాధించిన విజయాలను నేటి తరాలకు తెలిపేందుకు సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించనున్నామన్నారు. ఈనెల 30న నల్లగొండలో శత సంవత్సర ప్రారంభ సభ జరుగుతుందని, ఆ సభకు జిల్లానుండి పెద్దసంఖ్యలో కార్యకర్తలను తరలించనున్నట్లు పేర్కొన్నారు. శతవసంతాలు సభలను జయప్రదం చేయడానికి కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నామని అన్నారు. సభల జయప్రదానికి విస్తృత సమావేశాలు, సభలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ శత వసంతాల కాలంలో సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించిందని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కే. జానీమియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వేంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

8వ రోజుకు చేరిన.. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న దృశ్యం

కొత్తగూడెం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గతంలో ఇచ్చిన హామీ అమలు చేయాలని, తమను క్రమబద్ధీకరించి డిమాండ్లు నేరవేర్చాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె మంగళవారానికి 8వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ప్రధాన గేట్ వద్ద ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఉద్యోగుల సమ్మెతో జిల్లాలో 14కస్తూర్బా, ఒక అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో విద్యాబోధన సాగడం లేదు. 32 భవిత కేంద్రాల్లో సేవలు నిలిచిపోయాయి. 11 ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాయింగ్ అర్ట్, క్రాఫ్ట్, విద్య అందడం లేదు. రాష్ట్రస్థాయిలో ఉత్తర, ప్రత్యుత్తరాలు నిలిచిపోయాయి. కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ కాలేజీల్లో పరీక్షల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో విద్యార్థుల విద్యా భవితవ్యంపై ప్రభావం చూపుతోంది. పాఠశాలల్లో బోధించే ఉద్యోగుల సమ్మెతో విద్యార్థులకు నష్టం కలుగుతుందని, విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి బోధించాలని ఆదేశించినా ఆచరణకు నోచుకోవడం లేదు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై వేస్తే ఇక్కడి విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. గతంలో తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తమను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

బోనస్ కోసం బోర్డర్ దాటి..

(5వ పేజీ తరువాయి)

పలువురు రైస్‌మిల్లర్లతో పాటు కొందరు వ్యాపారులు అక్కడ క్వింటాకు రూ.2,300, రూ.2,400 చొప్పున కొనుగోలు చేసి ఇక్కడికి తెస్తున్నారు. ఇక్కడ క్వింటాకు రూ.2,320 మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ఇచ్చే రూ.500బోనస్ కలిపి రూ.2,820 పొందుతున్నారు. గతంలో ఉన్న సీఎంఆర్ బకాయి బియ్యం అప్పగించడంతో పాటు రోజువారీ బియ్యం వ్యాపారానికి కూడా రైస్‌మిల్లర్లకు సన్నధాన్యం అవసరం పెరిగింది. దీంతో పొరుగున ఉన్న ఏపీ ధాన్యంపై ఆధారపడుతున్నారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి అటు రైస్‌మిల్లర్లు, ధాన్యం వ్యాపారులు ఏపీలోని పలు జిల్లాలకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేసి ఇక్కడికి తరలిస్తున్నారు. కొన్ని లారీలు రైస్‌మిల్లులకు వెళుతుండగా కొన్ని లారీలు గ్రామా ల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం తెచ్చి అమ్ముతున్నారు. లారీకి రూ.లక్షన్నర రూ.2లక్షల వరకు బోనస్ రూపంలో దళారులకు మిగులుతుండడంతో ఈ అక్రమ వ్యాపారాన్ని చడీచప్పుడు కాకుండా నడిపిస్తున్నారు. లాభం బాగా ఉండటంతో అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది.

ఒకరు వద్దంటారు.. మరొకరు ఓకే అంటారు

ఇతర రాష్ట్రాలనుంచి సన్నధాన్యం దిగుమతి కాకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు నల్లగొండ జిల్లా సరిహద్దుల్లో పటిష్ట నిఘా చర్యలు చేపట్టాల్సి ఉంది. కొన్నిచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు సివిల్ సప్లయీస్, మార్కెటింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోలేదు. 'ఎవరికి వారే. యమునా తీరే' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మార్కెటింగ్‌శాఖ అధికారులు ఏపీ నుంచి వస్తున్న సన్నధాన్యం లారీలకు ఒకశాతం సెస్ కట్టించుకుని తెలంగాణలోకి అనుమతి ఇస్తున్నారు. పోలీసులు కూడా అక్రమంగా ధాన్యం వచ్చినందుకు తమ స్టేషన్ల పరిధిలో లారీకి రూ.3వేల వంతున అపరాధ రుసుం వసూలు చేసి పంపిస్తున్నారు. ఆదివారం ముదిగొండ మండలం వల్లభి చెక్‌పోస్టు నుంచి సుమారు 91లారీలు రాగా 60లారీలకు మార్కెటింగ్ శాఖ అధికారులు సెస్ కట్టించుకొని అనుమతి ఇచ్చారు. మరో 31లారీలను సివిల్ సప్లయీస్ అధికారులు వెనక్కి పంపారు.

లారీలకు ఫైన్

మార్కెటింగ్‌శాఖకు సెస్ కట్టిన లారీలను నేలకొండపల్లి మండలం చెరువుమాధారం వద్ద రైతులు పట్టుకోవడంతో పోలీసులు కూడా ఆ లారీలకు ఒక్కోదానికి రూ.3వేల వంతున ఫైన్ వేసి పంపించారు. వాస్తవానికి సన్నధాన్యం ఏపీ నుంచి తెలంగాణలో ప్రవేశించడంపై నిషేధం ఉంది. ఇలా వస్తే సివిల్ సప్లయీస్‌తో పాటు వ్యవసాయ మార్కెటింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు లారీలను అడ్డుకోవడంతో పాటు అతిక్రమించినవారిపై కేసులు పెట్టడం వంటి చర్యలు చేపట్టాలి. కానీ ఎవరికి వారు తమకు నచ్చినట్లు వ్యవహరిస్తుండడంతో వ్యాపారులు యథేచ్ఛగా సన్నధాన్యాన్ని బోర్డర్ దాటిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఏపీ సరిహద్దు మండలాల నుంచి రాత్రివేళ, తెల్లవారుజామున లారీల్లో ధాన్యం తెచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని కల్లాల్లో పోసి వెళుతున్నారు. ఆ ధాన్యాన్ని తమకు ఇక్కడ తెలిసిన రైతుల పేర్లతో అమ్మి దళారులు సొమ్ము చేసుకుంటున్నారు.

రూ.350కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లు

ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 340 కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.350కోట్ల విలువైన 1లక్షా 50వేల మె.ట ధాన్యాన్ని సేకరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.51కోట్ల మేర రైతులకు బోనస్ కూడా చెల్లించారు. సంక్రాంతి వరకు ధాన్యం కొనుగోలు జరిగే అవకాశం ఉంది. మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వాస్తవానికి జిల్లాలో 4.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుచేయాలని లక్ష్యం పెట్టుకున్నా మొదట్లో మిల్లర్లు పోటీపడి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు. దాంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తగ్గింది.

దుబాయ్‌లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు 20న ఇంటర్వ్యూ

జిల్లా ఉపాధికల్పన అధికారి మాధవి

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ (యూఏఈ)లో డెలివరీ బాయ్స్‌గా పని చేసేందుకు బైక్ రైడర్స్ కోసం ఈ నెల 20న హైదరాబాద్ విజయనగర కాలనీలోని మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్‌లో టామ్‌కామ్ ఏజెన్సీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఉపాధికల్పన అధికారి మాధవి తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె కోరారు. తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలశాఖ కింద నమోదు చేసిన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టామ్‌కామ్ అని, దీని ద్వారా తెలంగాణ నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగాలు కల్పించేందుకు విదేశాలలో ప్రభుత్వ ప్రైవేట్ రిజిస్టర్డ్ ఏజెన్సీలతో భాగస్వామ్యం కుదుర్చుకుందని తెలిపారు.

అభ్యర్థులు 21 నుంచి 38 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై, 3 సంవత్సరాల డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఇంటర్వ్యూకు ఒరిజినల్ పాస్‌పోర్ట్ తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9440050951, 9440049861 , 9440051452 నెంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

ఉద్దీపకం అమలుపై పీవో అసంతృప్తి

ముగ్గురు టీచర్లకు షోకాజ్ నోటీసు

దుమ్ముగూడెం డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన పరిషత్ పాఠశాలల విద్యార్థులు గణితం, ఆంగ్లంపై పట్టు సాధించడం కోసం ప్రవేశపెట్టిన ఉద్దీపకం ప్రత్యేక కార్యాచరణ అమలుపై ఐటీడీఏ పీవో రాహుల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం బండారుగూడెం, రేగుంట గిరిజన పరిషత్ పాఠశాలలతోపాటు ఆర్లగూడెం గిరిజన బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఉద్దీపకం, ఎస్సీఆర్పీ పుస్తకాల్లోని పాఠ్యాంశాల నుంచి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. తరగతి గదుల్లోని ఒక్కో విద్యార్థిని నిలబెట్టి వర్క్ బుక్స్‌లోని సారాంశాలను అడిగి తెలుసుకోవడంతోపాటు, బోర్డుపై సమాధానాలను రాయించారు. ఉద్దీపకం పుస్తకాల్లోని పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఎస్సీఆర్పీ పనితీరు మెరుగుపరచుకొని ప్రతీ రోజూ తన పరిధిలోని పాఠశాలల్లో ఉద్దీపకం అమలును పరిశీలించాలన్నారు. అనధికారిక సెలవుపై వెళ్లిన రేగుంట జీపీఎస్ టీచర్ వసంత, టీచింగ్ డైరీ సక్రమంగా నిర్వహించని వెంకన్న, సత్తెమ్మలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏసీఎంవో రమణయ్యను ఆదేశించారు. అనంతరం ఆర్లగూడెం ఏజీహెచ్‌ఎస్‌ను సందర్శించి వేదిక్ మాథ్స్ కార్యక్రమ అమలును పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సరిగా అమలు చేయకపోతే హెచ్‌ఎం, వార్డెన్లపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. హెచ్‌ఎం సోమశేఖర్, ఎస్సీఆర్పీ రామారావు తదితరులున్నారు.

బాడీ బిల్డింగ్‌లో సత్తుపల్లి యువకుడి ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న కోటేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15, 16వ తేదీల్లో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల స్థాయిలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తుపల్లికి చెందిన కంచేటి కోటేశ్వరరావు ప్రశంసలు అందుకున్నారు. 60 కిలోల విభాగంలో తన ప్రతిభతో మెమెంటో, ప్రశంసాపత్రాలను సాధించారు. అసోసియేషన్ బాధ్యులు కోటేశ్వరరావును అభినందించారు. కాగా ఈయన స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో గ్రౌండ్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకుడిగా అందరికీ శిక్షణ ఇస్తున్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలలో నగర క్రీడాకారుడి ప్రతిభ



ఆదిత్యమౌర్య

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఈనెల 9 నుంచి 15 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలలో ఖమ్మం నగరానికి చెందిన మహంకాళి ఆదిత్యమౌర్య సత్తా చాటి ద్వితీయ బహుమతి సాధించాడు. అండర్-17 విభాగంలో 70- 75 కేజీల విభాగంలో పోటీపడిన ఆదిత్య రజత పతకం కైవసం చేసుకున్నాడు. జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలలో ప్రతిభ చూపిన ఆదిత్యమౌర్యను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, కోచ్‌లు హర్ష, కార్తిక్ అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

రేపటినుంచి రాష్ట్రస్థాయి సోషల్ వెల్ఫేర్ క్రీడలు

- భద్రాద్రి జిల్లా పాల్వంచలో నిర్వహణ
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి మంత్రులు తుమ్మల, పొంగులేటి
- పాల్గొననున్న 1358 మంది క్రీడాకారులు



మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

పాల్వంచ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాల్వంచలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల మైదానంలో పదో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు గురువారం నుంచి నిర్వహించనున్నారు. ఈ పోటీలు 21 వరకు కొనసాగనున్నాయి. ఈ పోటీల కోసం మైదానాన్ని సర్వంసిద్ధం చేశారు. రాష్ట్రస్థాయిలో జరిగే బాలుర క్రీడాపోటీల్లో 1358మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. రాష్ట్రంలోని ఏడు జోన్లలోని కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి, యాదాద్రి, జోగులాంబ, చార్మినార్‌లలోని సోషల్ వెల్ఫేర్ గురుకులం పాఠశాలలో క్రీడాకారులు ఇక్కడికి చేరుకోనున్నారు. పాల్వంచ సోషల్ వెల్ఫేర్‌లో విద్యార్థులందరికి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక వసతిగదులతోపాటు క్రీడాకారులకు మైదానంలో తగిన తర్ఫీదును ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లా జట్లకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ఈ క్రీడా పోటీల్లో 200మంది కోచ్‌లు..

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఏడు జోన్ల నుంచి వచ్చే 1358మంది క్రీడాకారులకు పోటీలు నిర్వహించేందుకు 200మంది పీఈటీ, పీడీలను నియమించారు. అండర్- 19 విభాగానికి సంబంధించి 11 ఈవెంట్స్‌ను నిర్వహించనున్నారు. అండర్-17 బాలురకు 11 ఈవెంట్స్, అండర్- 14 బాలురకు ఐదు క్రీడలు, అథ్లెటిక్స్‌లో 8 ఈవెంట్స్‌ను నిర్వహించనున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, తదితర క్రీడలతోపాటు అథ్లెటిక్స్‌లో 100మీటర్ల నుంచి 800మీటర్ల వరకు రన్నింగ్, షాట్‌పుట్, హైజంప్, లాంగ్ జంప్ ఈ క్రీడలను పీఈటీ, పీడీలు నిర్వహించనున్నారు.

ఉమ్మడి జిల్లా క్రీడాకారులు..

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఈ పోటీల్లో పాల్వంచ, తిరుమలాయపాలెం, ఖమ్మం, ముదిగొండ, సత్తుపల్లిలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నుంచి ఈ క్రీడల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఈ పోటీలకు క్రీడాకారులకు కోచింగ్ క్యాంపును కూడ నిర్వహించారు. ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాట్‌మెంటన్ క్రీడల్లో గతంలో రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభను చాటిన క్రీడాకారులు ఉమ్మడి జిల్లా జట్టు నుంచి పాల్గొననున్నారు. స్థానిక పీఈటీలు ప్రత్యేకమైన శిక్షణ ఇస్తున్నారు.

మల్టీజోన్ అధికారిగా అలివేలు

ఈ క్రీడల నిర్వహణలో మల్టీజోన్ అధికారిగా అలివేలు, నాల్గో జోన్ అధికారిగా కే. స్వరూప, ప్రిన్సిపాల్ పీపీఎన్. పాపారావు, గేమ్స్ సూపర్‌వైజర్‌గా ఎస్. శంకర్, పీడీ మల్లేష్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడాపోటీలకు అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైన సదుపాయాలపై చర్చించారు. ఎక్కడ లోటుపాట్లు లేకుండ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

వలస ఆదివాసీల సంక్షేమమే పోలీసుల లక్ష్యం

- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్
- అడవిరామవరం గ్రామం సందర్శన
- దుప్పట్లు, లైట్లు, నిత్యావసరాల పంపిణీ



ఆళ్లపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల్లో మావోయిస్టుల అలజడులను తట్టుకోలేక ప్రశాంతమైన జీవనం కోసం తెలంగాణలోకి వచ్చిన వలస ఆదివాసీ (గొత్తికోయ)లను అభివృద్ధి దిశగా, వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే భద్రాద్రి జిల్లా పోలీసుల లక్ష్యమని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లాలోని మారుముల ప్రాంతమైన ఆళ్లపల్లి మండలం అడవిరామవరం గ్రామాన్ని సందర్శించారు. గుండాల పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ సికింద్రాబాద్ మెంబర్ ఎస్‌కే సోందు పాషా సమక్షంలో ఎస్పీ అడవిరామవరం గ్రామస్థులకు దుప్పట్లు, సోలార్‌లైట్లు, నిత్యావసరాలు, చీరలు, దుస్తులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉంటున్న గిరిజనులతోపాటు వలస ఆదివాసీలకు ఏ సమస్య వచ్చిన పోలీసుల సహకారం ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. గ్రామస్థుల సమస్యలను జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం దిశగా పోలీసులు ప్రయత్నిస్తారన్నారు. అనంతరం ఓఎస్‌డీ సాయిమనోహర్ మాట్లాడుతూ.. ఎస్పీ మీ గ్రామానికి వచ్చి మీ సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం ప్రణాళిక చేయడం హర్షించదగిన విషయం అన్నారు. మావోయిస్టులకు దూరంగా ఉంటే మీ జీవితాల్లోకి కొత్తవెలుగులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ సాయిమనోహర్, ఇల్లందు డీఎస్పీ చంద్రభాను, టేకులపల్లి, గుండాల సీఐలు సురేష్, రవిందర్, ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీష్, ఆళ్లపల్లి, గుండాల పీహెచ్‌సీ వైద్యులు సంఘమిత్ర, సుధీర్, అడవిరామవరం మాజీ సర్పంచ్ శ్రీదేవి, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

ద్విచక్రవాహనంపై ఎస్పీ ప్రయాణం

అడవిరామవరం వెల్లందుకు బోడాయికుంట నుంచి రహదారి లేకపోవడంతో ఎస్పీ రోహిత్‌రాజ్ ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడిమిగూడెం, బోడాయికుంట నుంచి ద్విచక్రవాహనంపై దట్టమైన అడవిమార్గంలో, వాగులు, ఒర్రెలు దాటుకుంటు సుమారు ఎనిమిది కిలోమీటర్లు ఓఎస్‌డీతో కలిసి అడవిరామవరం చేరుకున్నారు. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టబందోబస్తు ఏర్పాటు చేశారు.

రేగళ్ల యువతికి సీఎం కప్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్



గంగాభవాని

లక్ష్మీదేవిపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎంకప్ పోటీల్లో భాగంగా భద్రాచలంలో జరిగిన జిల్లాస్థాయి పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లకు చెందిన గంగాభవాని ద్వితీయస్థానాన్ని సాధించారు. 52 కేజీల క్యాటగిరిలో భవాని ఈ విజయం సాధించినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లో జరగనున్న పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. గంగాభవానిని కొత్తగూడేనికి చెందిన పవర్‌లిఫ్టింగ్ జిమ్ నిర్వాహకులు, పవర్‌లిఫ్టింగ్ శిక్షకులు సయుద్దీన్ అభినందించారు.

ఖమ్మం జిల్లాకు నలుగురు ఏఎంవీఐలు

ముగ్గురు బాధ్యతల స్వీకరణ ●ఖమ్మం, వైరా కేటాయింపు



విధుల్లో చేరిన ఏఎంవీఐలు

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 17: జిల్లా రవాణాశాఖకు అధికారుల కొరత తీరింది. పదేళ్లుగా జిల్లా రవాణాశాఖకు అసిస్టెంట్ మోటారు ఇన్స్‌పెక్టర్ల కొరత ఉంది. అయితే ఇటీవల జరిగిన నియామకాల్లో ఖమ్మం జిల్లాకు నలుగురు అసిస్టెంట్ మోటారు ఇన్స్‌పెక్టర్లు కేటాయింపు జరిగింది. దీంతో మంగళవారం ముగ్గురు ఏఎంవీఐలు ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో జాయిన్ అయ్యారు. వీరిలో గుగులోత్ సుమలత, వీ గోపికృష్ణ, గంగావత్ దినేష్ ఉన్నారు. నిమ్మత్రి రవిచందర్ జాయిన్ కావాల్సి ఉంది. కాగా గుగులోత్ సుమలత, వీ గోపికృష్ణకు ఖమ్మం, గంగావత్ దినేష్‌కు వైరా ప్రాంతీయ కార్యాలయాలకు కేటాయించారు.

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి ఏడాది జైలు

ఖమ్మంలీగల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పట్టణం శ్రీనగర్‌కాలనీకి చెందిన చెల్లనిచెక్కు కేసులో నిందితురాలైన కోమాటి నీలిమకు సంవత్సరం జైలుశిక్షతో పాటు ఫిర్యాదుకి రూ.ఐదు లక్షల ఇరవైవేలను చెల్లించాలని ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు. ఖమ్మంపట్టణం శ్రీనగర్‌కాలనీకి చెందిన ఫిర్యాది దిరిశాల రవికుమార్ వద్ద నిందితురాలు తన కుటుంబ అవసరాల కోసం 15సెప్టెంబరు 2018 నాడు రూ. నాలుగు లక్షలను అప్పుగా తీసుకుని అదే రోజు ఫిర్యాదికి ప్రాంసరీ నోటు రాయించి ఇచ్చింది. కొంతకాలం తర్వాత ఫిర్యాది తన అప్పు తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా రూ.ఐదులక్షల ఇరవై వేలకు 15డిసెంబరు 2019 నాడు చెక్కు జారీ చేసినది. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమ చేయగా నిందితురాలి ఖాతాలో సరిపడా నగదు లేనందున తిరస్కరణకు గురైనది. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో నిందితురాలికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

నేటి నుంచి హైదరాబాద్‌కు ప్రతి 45 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ బస్సు

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు ప్రతి 45 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ బస్‌ను ఏర్పాటు చేసినట్లు ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్ దినేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాన్ని అందించేందుకు ఖమ్మం నూతన బస్టాండ్ నుంచి ఉదయం, సాయంత్రం రాజధాని నాన్‌స్టాప్ సర్వీసులు నడిపిస్తుండగా, ప్రయాణికుల నుంచి ఆదరణ లభించడంతోనే బుధవారం నుంచి ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు ప్రతి 45 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు రాజధాని మొదటి బస్సు ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమై, రాత్రి 10:45 నిమిషాల వరకు సర్వీస్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. హైదరాబాద్ నుంచి ఖమ్మానికి నాన్‌స్టాప్ రాజధాని మొదటి బస్సు ఉదయం 4:15 నిమిషాలకు ప్రారంభమై, రాత్రి 11:30 గంటల వరకు ప్రతి 45 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కామేపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆటోను తుఫాన్ వాహనం ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన కామేపల్లి మండలం రుక్కితండ స్టేజీ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాద్ జిల్లా ఈదుల పూసపల్లి గ్రామానికి చెందిన బానోత్ ప్రవీణ్(30) తన ఆటోలో డోర్నకల్ నుంచి బండిపాడు మీదుగా ఖమ్మం వెళ్తుండగా, రుక్కితండ స్టేజీ సమీపంలో ఎదురుగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడు...

తల్లాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన తల్లాడలో మంగళవారం చోటుచేసుకుంది. మృతుడి తండ్రి వెంకటస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం రోడ్డులోగల వెంచర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా బుచ్చువన్నెపాలెం గ్రామానికి చెందిన అలుగు వెంకటేశ్వర్లు(34)అనే యువకుడు రెండునెలల క్రితం కూలీపని నిమిత్తం తల్లాడకు వచ్చాడు. మంగళవారం వెంచర్‌లో పనికి వచ్చి కాంక్రీట్ వాహనంలో కాంక్రీట్ కలుపుతుండగా 11కేవీ విద్యుత్ తీగలు వాహనానికి తగిలింది. కాంక్రీట్ మిక్సింగ్ చేస్తున్న వెంకటేశ్వర్లు విద్యుదాఘాతంతో స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు వెంటనే అపస్మారకస్థితిలో ఉన్న అతడిని స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. డాక్టర్లు సీపీఆర్ చేసిన తర్వాత మెరుగైన వైద్యం కోసం 108వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఆశ్రమపాఠశాల విద్యార్థి..

దుమ్ముగూడెం డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ఆశ్రమపాఠశాల విద్యార్థి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 14న మృతి చెందిన విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బూర్గంపాడు మండలం లక్ష్మీపురానికి చెందిన చరణ్(13) కొత్తపల్లి ఆశ్రమపాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నాడు. దురదలతో ఇబ్బంది పడుతున్నాడని చెప్పి విద్యార్థి చరణ్‌ను అతని తల్లిదండ్రులు ఈనెల 1న ఆశ్రమపాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్లారు. దురదలకు స్థానికంగా వైద్యం చేయించారు. అనారోగ్యం కారణంగా ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రిలో ఈనెల 13న చేర్చారు. పీవో ఆదేశాల మేరకు మెరుగైన చికిత్సల కోసం అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించించినట్లు తెలిసింది.

ఈ విషయమై హెచ్‌ఎం నర్సింహారావును వివరణ కోరగా ఒకట్రెండు రోజుల్లో హాస్టలుకు పంపుతామని అనుమతి పత్రం రాసిచ్చి చరణ్‌ను అతని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారని తెలిపారు. ఈనెల 13న ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చిన అనంతరం వైద్యచికిత్సల కోసం డబ్బులు కావాలని చరణ్ పేరెంట్స్ అభ్యర్థించడంతో తన సొంత డబ్బులు రూ.35వేలు ఇచ్చానని తెలిపారు. హాస్టలుకు రావాలని పిలిచేందుకు మధ్యలో ఓసారి వార్డెన్‌ను లక్ష్మీపురం పంపించినా విద్యార్థిని పంపలేదన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ...

నేలకొండపల్లి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. మండల పరిధిలోని తిరుమలాపురం తండాకు చెందిన భూక్యా లాక్యా(75) సోమవారం తన పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా, తండా సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద డీసీఎం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ఖమ్మంలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, నలుగురు కుమారులున్నారు. నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరి అదృశ్యంపై కేసు నమోదు

చింతకాని, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడ గ్రామానికి చెందిన బాలుడు కోట ప్రజ్వల్, లచ్చగూడెం గ్రామానికి చెందిన తుంగా వెంకటేష్ అదృశ్యమైనట్లు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వీరు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పల్లె దారులకు నిధులు

- ఉపాధిహామీలో రూ.16.25 కోట్లు
- సీఆర్‌ఆర్ రోడ్లకు రూ .25 కోట్లతో పనులు




క్వాలిటీ పరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): చినుకు పడితే చాలు పల్లె రోడ్లు ఛిద్రం అవుతున్నాయి. ఆ రోడ్లపై ముందుకు కదలలేని పరిస్థితి. ఉపాధిహామీ పథకంలో భాగంగా ఖమ్మం డివిజన్‌లో రూ.16.25 కోట్ల నిధులు విడుదల కావడంతో గ్రామాల్లో రవాణా కష్టాలు తీరనున్నాయి. గుంతల రహదారులకు మహర్దశ పట్టనుంది. 2023-24 సంవత్సరానికి 404 సీసీ రోడ్లకు రూ.16.85 కోట్లు విడుదలయ్యాయి. వీటిలో ఇప్పటి వరకు 140 రోడ్లను రూ. 4కోట్లతో పూర్తి చేశారు. మిగిలిన రోడ్లను మార్చి లోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

నాణ్యతగా చేపడుతున్నాం

● మహేష్, పంచాయతీరాజ్ డీఈ, ఖమ్మం డివిజన్



గ్రామీణ రోడ్లను నాణ్యతాయుతంగా నిర్మిస్తున్నాం. ఎక్కడా రాజీ పడకుండా రోడ్లు పదికాలాల పాటు మన్నేలా నిర్మిస్తున్నాం. క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా రోడ్ల నిర్మాణాలను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. మార్చి నాటికి మంజూరైన రోడ్లన్నీ పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధిహామీ పనులను కూడా ఈరోడ్లకు వినియోగిస్తున్నాం.

సీఆర్‌ఆర్ రోడ్లకు ....

సీఆర్‌ఆర్ (కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్) కింది 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.25 కోట్లు విడుదలయ్యాయి. వీటితో 12 రోడ్లను నిర్మించనున్నారు. ఇవన్నీ దాదాపు టెండర్ల దశలో ఉన్నట్లు డీఈ మహేష్ తెలిపారు. అంతే కాకుండా 2022 - 23 సంవత్సరానికి గాను రూ 11.06 కోట్లతో 6 రోడ్ల పనులు చేపట్టగా వీటిలో ఒక రోడ్డుకు అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో నిలిచిపోయింది. 2023-24 సంవత్సరానికి గాను రూ.12.04 కోట్లతో మరో 6 రోడ్లకు గాను 5 రోడ్లు ప్రగతిలో ఉన్నాయి. మరో రోడ్డు అటవీశాఖ అనుమతి కోసం నిలిచిపోయింది. మిగిలిన 9 రోడ్లలో ఇప్పటివరకు 7 రోడ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మరో రెండు రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. వీటిని మరో నెల రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఖమ్మం డివిజన్‌లో వీఆర్ బంజర గ్రామపంచాయతీ కార్యాలయం భవనానికి కూడా రూ. 20లక్షలు విడుదలయ్యాయి. చింతగుర్తి అంగన్‌వాడీ భవనానికి కూడా రూ.12 లక్షలు విడుదలయ్యాయి. వీటిని కూడా త్వరలో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

బీసీ గురుకుల విద్యార్థినికి సండ్ర పరామర్శ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

ఖమ్మంటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎలుకల దాడికి గురై నగరంలోని మమత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీసీ గురుకుల విద్యార్థిని లక్ష్మీ భవానికీర్తిని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మంగళవారం పరామర్శించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని తల్లి, ఇతర కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. హాస్టల్‌లో సౌకర్యాల లేమి, ఎలుకల సంచారం, విద్యార్థికి పదేపదే ఇంజక్షన్‌లు చేయటంపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతిగృహాల్లో దారుణాలు జరుగుతున్నాయన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలతో తాము హాస్టళ్లబాట పడితే దిగివచ్చిన ప్రభుత్వం కొత్తమెనూను ప్రారంభించినట్లు హడావుడి చేశారని విమర్శించారు. దానవాయిగూడెం బీసీ గురుకులంలో విద్యార్థినులపై 11నుంచి 15సార్లు ఎలుకలు దాడిచేసి, కొరకాయంటే అధికారులు, టీచర్ల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం అవుతుందన్నారు. వైద్యుల సలహా లేనిదే వ్యాక్సిన్లు ఎలా వేశారని సండ్ర ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి విద్యార్థుల రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

బీసీ గురుకుల విద్యార్థిని లక్ష్మీభవాని కీర్తి ఎలుకల దాడికి గురై, సరైన వైద్యసహాయం అందక అనారోగ్యం పాలవటానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితపై ఢిల్లీనుంచి ఆరా తీసిన ఆయన ఒక ప్రకటన చేస్తూ విద్యార్థినిని తక్షణమే హైదరాబాద్‌కు తరలించి, మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా ఎలుకల దాడికి గురైన విద్యార్థిని లక్ష్మీభవాని కీర్తికి మెరుగైన వైద్యం అందించాలని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంటనే గురుకుల హాస్టళ్లలో వసతులు కల్పించి, నాణ్యమైన ఆహారం అందించాలని నామా డిమాండ్ చేశారు.

'దళితబంధు' పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు

మణుగూరుటౌన్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): దళిత బంధు పేరుతో రూ.10లక్షలు ఇప్పిస్తానని మోసగించి రూ.80 వేలు తీసుకున్న హోం గార్డు కటుకోజు శ్రీనివాసచారిపై మంగళవారం చీటింగ్ కేస్ నమో దైంది.. సీఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సమితి సింగారం గ్రామానికి చెందిన మద్దూరి నవీన్‌కుమార్‌కు గత ప్రభుత్వం కాలంలో దళితబంధు పథకాన్ని ఇప్పిస్తానని, మణుగూరులో పనిచేసిన హోంగార్డు శ్రీనివాసచారి రూ.80 వేలు తీసుకున్నాడు. దళితబంధు ఇప్పించకపోగా డబ్బులు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో ఈ మేరకు శ్రీనివాసచారిపై నవీన్ కుమార్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలలో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో జరిగిన సీఎంకప్ పట్టణస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు గౌరిశెట్టి చార్విక్, షేక్ ఫజల్ ప్రతిభ చూపి ప్రథమ బహుమతి సాధించారని సర్వజ్ఞ పాఠశాల అధినేత రాజావాసిరెడ్డి నాగేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో చార్విక్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.



విద్యార్థులను అభినందిస్తున్న నాగేంద్రకుమార్

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	24రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	54
పచ్చిమిర్చి	28
కాకరకాయ	34
బెండకాయ	40
పొట్లకాయ	48
దోసకాయ	34-38
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	38
క్యాబేజీ	24
దొండ	44-50
సొరకాయ	20
క్యారెట్	48
క్యాప్సికం	60
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	పుష్ప 2 (హిందీ)
శ్రీనివాస:	పని
సాయిరాం:	మిస్‌యూ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	ప్రణయగోదావరి

కార్మికుల అరెస్టు అప్రజాస్వామికం

ఉమ్మడి జిల్లాలో అక్రమంగా 40మంది నాయకులపై బైండోవర్ కేసులు

టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రామయ్య

టీయూసీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీయూసీఐ నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన చేస్తామని ప్రజలకు ఎన్నికల హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పరిపాలనలోనే అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని టీయూసీఐ నాయకులు ఆరోపించారు. న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు నిరసనలకు పిలుపునిస్తే ఆ ప్రజాస్వామికంగా ఈనెల 16నుంచి అరెస్టులు చేసి అక్రమంగా బైండోవర్ కేసులు బనాయిస్తున్నారని టీయూసీఐ(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య ఆరోపించారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ టీయూసీఐ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి, జిల్లా అధ్యక్షుడు అప్పారావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి వై గోపాల్‌రావు, ఇతర మండలాలకు చెందిన 40 మంది నాయకులను ముందస్తు అరెస్టులు చేసి బైండోవర్ కేసులు పెట్టారని ఆరోపించారు. పంచాయతీ కార్మికుల అక్రమ బైండోవర్‌లను నిర్బంధాలను తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. నాయకులు మొలకలపల్లి లక్ష్మీనారాయణ, కొయ్యల శ్రీనివాస్, బీ రమేష్, శంకర్, రమేష్, వీరయ్య వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు యాప్రాన్, బూట్లు అందజేత

పంపిణీ చేసిన కార్పొరేటర్ విజయవెంకటరమణ

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చొరవతో పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని 44వ డివిజన్ కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు యాప్రాన్, బూట్లు కిట్‌లను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్యక్రమాల సందర్భంగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కార్మికులకు సూచించారు.



పారిశుధ్య కార్మికులతో కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ

ఇష్టమైతే పనిచేయండి.. లేదంటే సెలవుపై వెళ్లిపోండి

మంచుకొండలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం

వైద్యాధికారికి షోకాజ్ నోటీసు

రఘునాథపాలెం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'ప్రజలకు వైద్య సేవలు చేసేందుకు ఇష్టమైతే పనిచేయండి లేదంటే సెలవుపై వెళ్లండి' అంటూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారికి షోకాజ్ నోటీసుకు ఆదేశాలిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇద్దరు వైద్యుల్లో ఒక్కరు కూడా విధుల్లో లేక పోవటంపై కలెక్టర్ ఆగ్రహం చెందారు. హాజరు రికార్డును పరిశీలించగా 15మంది హాజరు నమోదు జరిగి కేవలం ముగ్గురు మాత్రమే విధుల్లో ఉండటంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. మండల వైద్యాధికారి శ్రీదేవికి కలెక్టర్ ఫోన్ చేసి వివరణ కోరారు. సమయం పాటించాలని, ప్రత్యేకంగా ఓపీకి వైద్యున్ని కేటాయించినా ఎందుకు పూర్తి సమయం ఉండలేదని మందలించారు. అక్కడే ఉన్న రోగులతో కలెక్టర్ మాట్లాడి వైద్యసేవల తీరును తెలుసుకున్నారు. అనంతరం మంచుకొండ వైద్యాధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయిని ఆదేశించారు.



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నేటినుంచి బోదులబండలో క్రికెట్ టోర్నమెంట్

నేలకొండపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదర్‌థెరిస్సా యూత్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి సూర్యాపేట జిల్లా కోదాడ, ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గస్థాయి క్రికెట్‌టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వహణకమిటీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రథమ బహుమతిగా రూ.20,016లు (కట్టికోల నాగార్జున), ద్వితీయ బహుమతిగా 10,016లు (ఏటుకూరిప్రకాశరావు), తృతీయ బహుమతి రూ.5,016లు (కట్టికోల సుధాకర్)ఇవ్వనున్నట్లు కమిటీ తెలిపింది. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ ప్రకటనలో కోరింది.

కొనసాగుతున్న సీఎంకప్ క్రీడా పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం లో జరుగుతున్న సీఎంకప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సోమవారం జిల్లాలోని 21 మండలాల నుంచి సుమారు 481 మంది క్రీడాకారులు హాజరైనారు. పోటీల్లో భాగంగా మంగళవారం క్రీడాకారులకు కబడ్డీ(ఉమెన్), బ్యాడ్మింటన్(బాలురు, బాలికలు), ఉషూ(బాలురు, బాలికలు)విభాగాలలో పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పోటీలను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు షఫీ, సాంబమూర్తి, క్రిష్టఫర్‌బాబు, కోచ్‌లు గౌస్, అక్బర్‌అలీ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ నర్సింహమూర్తి పర్యవేక్షిస్తున్నారు.

ఓటరు జాబితా విడుదల

తిరుమలాయపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల తుది ఓటరు జాబితాను మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్‌కే సిలార్‌సాహెబ్ విడుదల చేశారు. మండలంలోని 40గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితాను మండలపరిషత్ కార్యాలయంలో ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో సూర్యానారాయణ, కార్యాలయ సిబ్బంది మీరా, శ్రీనివాస్, పాల్గొన్నారు.

అన్నం ఫౌండేషన్‌కు వృద్ధుడు

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కారు షెడ్డులో చంద్రయ్య అనే వృద్ధుడు గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా మంగళవారం ఆ వృద్ధుడిని నగరంలోని అన్నంసేవా ఫౌండేషన్‌కు తరలించారు. కుటుంబ వివరాలు అడుగగా చంద్రయ్యకు ఒక కూతురు ఉన్నట్టు ఆమె హైదరాబాద్‌లో ఉంటుందని తెలిపాడు. కుటుంబ సభ్యులు ఎవరు లేనందున ఆసుపత్రి వైద్యులు, మెప్మా అధికారులు సూచన మేరకు చంద్రయ్యను అన్నం ఫౌండేషన్‌కు తరలించారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులలో గణిత శాస్త్రానికి సంబంధించి ప్రతిభను వెలికి తీసేందుకు అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ (ఏఎంసీ) ఆన్‌లైన్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రెండో రౌండుకు ఎంపికైనట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల యాజమాన్యం మంగళవారం తెలిపింది. గత నెల 6న ఆన్‌లైన్‌లో నిర్వహించిన మొదటి రౌండ్లో విద్యార్థులు పాల్గొని పరీక్షకు హజరుకాగా ఈ నెల 16న వెలువరించిన ఫలితాలలో రెండో రౌండ్‌కు (అమెరికన్ ఇన్విటేషన్ మ్యాథ్స్ ఎగ్జాం) కు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు ఎస్.కె.రియాన్ అరాఫత్, టి.శ్రిజిత్, కె.రిషిత్, ఎస్.రుష్యేంద్రమణి, ఎమ్.జయరాం ఎంపికైనట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులు అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షకు హాజరు కావడం జరుగుతుందన్నారు. మంగళవారం హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ , ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఐఐటి బ్రాంచ్ ఇన్‌చార్జ్ జి.ఉమామహేశ్వర రావు, నాగరాజు పాల్గొన్నారు.



విద్యార్థులతో హార్వెస్టు పాఠశాల యాజమాన్యం

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు త్రివేణి విద్యార్థిని

ఖమ్మం స్పోర్ట్స్ డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో త్వరలో జరగనున్న సీఎంకప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని ఎస్. సంధ్య ఎంపికైందని త్రివేణి పాఠశాల యజమాన్యం తెలిపింది. సంధ్య ఈనెల 16న నగరంలో జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి కరాటే పోటీలలో ప్రతిభ చూపి ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికైందని తెలిపారు. విద్యార్థిని సంధ్యని పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సీఆర్‌వో కాట్రగడ్డ మొరళీక్రిష్ణ, అధ్యాపకులు స్వప్న, ముస్తఫా అభినందించారు. రాష్ట్ర పోటీలలో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.



సంధ్యను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ వీరేంద్రచౌదరి

గ్రామీణ వైద్యాన్ని బలోపేతం చేయాలి

రఘునాథపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యసేవలు మెరుగుపడటం ద్వారా గ్రామీణ వైద్యాన్ని బలోపేతం చేయాలని పీవోడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. మంచుకొండ పీహెచ్‌సీ పరిధిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేస్తూ పీవోడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. రఘునాథపాలెం మండలం నుంచి నిరుపేదలు కార్పొరేట్ హాస్పిటల్స్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. నాయకులు ప్రతాపనేని శోభ, ఝాన్సీ, ప్రేమ్‌సింగ్, చైతన్య కవిత, అనిత పాల్గొన్నారు.

22న జిల్లాస్థాయి సైన్స్ క్విజ్‌పోటీ

కూసుమంచి(ఖమ్మంరూరల్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాంధేయవాది చేకూరి కాశయ్య, ఎస్వీ నారాయణ జ్ఞాపకార్థంగా భారతీయ గణిత మేధావి శ్రీనివాసరామానుజం జయంతి పురస్కరించుకుని ఉమ్మడి ఖమ్మంజిల్లా స్థాయి సైన్స్ క్విజ్‌ను నిర్వహిస్తున్నట్లు గురుదక్షిణ ఫౌండేషన్ అధ్యక్షుడు శంకరయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. ఆరో తరగతి నుంచి పదోతరగతి చదువుతున్న విద్యార్థులు తమ పాఠశాలలనుంచి పాల్గొనవచ్చని తెలిపారు. 'నిత్యజీవితంలో సైన్స్' అనేఅంశంపై క్విజ్ ఉంటుందని తెలిపారు. మొదట రాత పరీక్ష నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉత్తమ జట్లకు దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా ప్రొజెక్టర్‌పై ఫైనల్ క్విజ్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తికలిగిన విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

లగచర్ల ఘటన అప్రజాస్వామికం

కామేపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): లగచర్ల గిరిజన రైతులపై అక్రమ కేసులు పెట్టి, థర్డ్ డిగ్రి ప్రయోగించడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య అన్నారు. మంగళవారం కామేపల్లిలో అంబేడ్కర్ విగ్రహనికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడారు.

మంత్రి తుమ్మల చొరవతో సంక్షేమ పథకాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రత్యేక చొరవతో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మంగళవారం పలు డివిజన్లలో లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. ఏడాది పాలనపై ప్రజలకు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తనిఖీ చేశారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని దశల వారీగా అర్హత కలిగిన అందరికి ఐదేళ్లలో ఇందిరమ్మ నివాసాలు మంజూరు జరుగుతాయని పేర్కొన్నారు. కార్పొరేటర్ కమర్తపు మురళీ పాల్గొన్నారు.

రవాణాశాఖకు ప్రింటర్ కష్టాలు

ఐదేళ్లుగా ఒకే ప్రింటర్‌పై కార్డుల ప్రింటింగ్ ●రెండేళ్లుగా మొరాయింపు, కార్డులపై గీతలు

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణాశాఖ నుంచి రాష్ట్ర రవాణాశాఖ ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి రూ.1.5 కోట్లు ఆదాయం సమకూరుతోంది. జిల్లా రవాణాశాఖ నుంచి డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇతర కార్డులు కలిపి రోజుకు 300 కార్డులు ప్రింటింగ్ ఉంటాయి. అయితే 2019లో రాష్ట్ర రవాణాశాఖ అధికారులు ఒక కలర్ ప్రింటర్‌ను జిల్లా కార్యాలయానికి పంపారు. ఐదేళ్ల కాలంలో 6లక్షలకు పైగా ప్రింటింగ్‌లు జరిగాయి. రెండేళ్లుగా ప్రింటర్ మొరాయిస్తూనే ఉంది. డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇతర కార్డులపై ప్రింటింగ్ గీతలు సైతం పడుతున్నాయి. అయి నా రాష్ట్ర రవాణాశాఖ కార్యాలయం నుంచి మాత్రం నూతన ప్రింటర్ రాలేదు. దీంతో ప్రతి రోజు ప్రతి పది కార్డులకు ఒకసారి ప్రింటర్‌కు మరమ్మతులు చేస్తూ ఉద్యోగులు కుస్తీ పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులలు స్పందించి జిల్లా రవాణాశాఖకు ప్రింటర్‌ను మంజూరు చేయించాల్సిన అవసరం ఉంది.

గురుకుల పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

ఖమ్మంటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని గురుకుల బాలికల పాఠశాలతో పాటు మరికొన్ని గురుకుల పాఠశాలలను ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సందర్శించారు. అక్కడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయినా గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించి, సమీక్షలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, జిల్లా నాయకులు మనోజ్ వంశీ, రోహిత్‌రాజు, సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కూసుమంచి/తిరుమలాయపాలెం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాలకు చెందిన 90మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ మాజీ చైర్మన్ స్వర్ణకుమారి చేతుల మీదుగా క్యాంపుకార్యాలయంలో అందజేశారు. ఖమ్మం రూరల్ మండలంలో 54మందికి రూ.15.89లక్షల విలువైన చెక్కులు, తిరుమలాయపాలెం మండలంలో 35మందికి రూ.13.43లోల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథ్‌బాబు, కాంగ్రెస్ అధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు భద్రకాళి, తిరుమలాయపాలెం మాజీ ఎంపీపీ మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు అన్నారు. మంగళవారం సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా తదితరులు సైదులుని కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని ఆ ప్రక్రియ పూర్తయే వరకు వారికి మినిమం పే స్కేల్ వెంటనే ప్రకటించాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గడిచిన వారం రోజులుగా కలెక్టరేట్ ఆవరణలోని ధర్నా చౌక్‌లో ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

22న కామ్రేడ్ చల్లా శంకర్ సంస్మరణ సభ

ఖమ్మంలీగల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): చల్లా శంకర్ సంస్మరణ సభ పోస్టర్‌ను ఖమ్మం కోర్టు ప్రాంగణంలో శంకరన్న మిత్రబృందం మంగళవారం విడుదల చేసింది. 22న ఉదయం 10గంటలకు ఇల్లెందుక్రాస్‌రోడ్డులోగల వేదిక ఫంక్షన్‌హాల్‌లో సంస్మరణ సభ జరగనుంది. ఈకార్యక్రమానికి కామ్రేడ్ విమలక్క ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. న్యాయవాదులందరు హాజరుకావాలని బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణారావు, సాలం వెంకటేశ్వర్లు, వంజాకుల లక్ష్మీనారాయణ తెలిపారు.

ఆరోగ్య విజ్ఞానాన్ని అందరికీ అందించాలి

సీఎంవో రాజశేఖర్

ముగిసిన రెండు రోజుల శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్య విజ్ఞానాన్ని అందరికీ అందించాలని స్కూల్ హెల్త్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న సీఎంవో యలగందుల రాజశేఖర్ అన్నారు. ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో స్కూల్ హెల్త్ అండ్ వెల్నెస్ ప్రోగ్రాం(ఎస్‌హెచ్‌డబ్ల్యూపీ)పై రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్‌ల శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎంవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను వివరించారు. వైద్య, ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా పాఠశాల స్థాయి నుంచి ఆరోగ్యానికి సంబంధించిన అవగాహన పెంపొందింప చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మండలం నుంచి వైద్య ఆరోగ్య శాఖ నుంచి నలుగురు జిల్లా విద్యాశాఖ నుంచి నలుగురు ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. శిక్షణలో పాల్గొన్న జిల్లా రిసోర్స్ పర్సన్‌లు రెండు రోజుల శిక్షణ కార్యక్రమంపై స్పందించడం సంతోషకరమన్నారు. మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంవో కే రవికుమార్, స్టేట్ రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ చందన, డాక్టర్ స్రవంతి, డాక్టర్ బాలకృష్ణ, పెసర ప్రభాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, డాన్ బాస్కో తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాల వితరణ

కూసుమంచి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలేరు గ్రామంలోని ఉన్నత పాఠశాలకు చెందిన వందమంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన శీలం రామకృష్ణ స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు వితరణగా అందజేశారు. గ్రామీణ విద్యార్థులు ఇంగ్లీషులో మాట్లేడేందుకు ఉపయోగపడుతాయని భావించి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదవాలని ఆకాంక్షించారు. ఆంగ్ల మాధ్యమంపై ప్రోత్సహించేందుకు నెలకోసారి పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీ పరీక్షల్లో రాణించేందుకు కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం అని అన్నారు. తమ తండ్రి వెంకటయ్య జ్ఞాపకార్థం ప్రతిఏటా విద్యార్థులందరికి ఇంగ్లీష్ పుస్తకాలుఅందిస్తున్నట్లు వివరించారు.

పామాయిల్ సాగుతో అదనపు ఆదాయం

జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం వ్యవసాయం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుతో వచ్చే ఆదాయం పాటు, అంతర పంటల సాగు వలన అదనపు ఆదాయం పొందవచ్చునని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. చింతకాని మండలం వందనం గ్రామంలో పామాయిల్ తోటలను, కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలోని గోద్రెజ్ కంపెనీకి చెందిన పామాయిల్ నర్సరీని మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పామాయిల్ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం పామాయిల్ పంటలకు ఇచ్చే రాయితీని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ పామాయిల్ సాగు రాయితీ వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ క్షేత్ర పర్యటనలో వైరా ఉద్యాన అధికారి ఎ.వేణు, మధిర ఉద్యాన అధికారి ఎ.విష్ణు, పామాయిల్ ఫీల్డ్ ఆఫీసర్ వెన్నెల, పామాయిల్ రైతులు సితరంబాబు, నాగిరెడ్డి, గోద్రెజ్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ చావా వెంకటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ





అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బొంతు రాంబాబు

1262, 1271రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వినతి

వైరా, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన 1262, 1271సన్నరకాల ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు తొలగించి బేషరత్‌గా ఎగుమతులు, దిగుమతులు చేయాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి జిల్లా తెలంగాణ రైతు సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఖమ్మం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. 1262, 1271రకాలకు చెందిన కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసి పదిరోజుల వుతున్నా ధాన్యం బస్తాలు మిల్లులకు తరలించడం లేదని వివరించారు. వెంటనే మిల్లర్ల అభ్యంతరాలు తొలగించి రెండురకాల ధాన్యాన్ని సేకరణ చేయాలని కోరారు. వీరి విజ్ఞప్తికి స్పందించిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి 1262, 1271రకాల ధాన్యాన్ని సన్నరకాల కింద కొనుగోలు చేస్తామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, షేక్.మీరా, నాయకులు బాణాల శ్రీనివాసరావు, సంక్రాంతి నర్సయ్య, బాణాల కృష్ణమాచారి, యనమద్ది రామకృష్ణ, బోడేపూడి వీరభద్రం, రాజేష్ పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారించాలి

» ఏడీఏ విజయచంద్ర



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

చింతకాని, డిసెంబరు 17: మొక్కజొన్నలో కత్తెర పురుగు వ్యాప్తి అధికంగా ఉందని నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ విజయచంద్ర అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు మొక్కజొన్న సాగు, వరి వెదజల్లు పద్ధతిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యాసంగిలో వరి వెదజల్లుడు పద్ధతి ద్వారా వరిసాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో మానస, ఏఈఓలు పాల్గొన్నారు.

వరద నీరు పోయేదెలా..?

» రోడ్డును మించి ఎత్తులో నిర్మించిన డ్రైయిన్
» రహదారిపై నిలుస్తున్న మురుగునీరు » పట్టించుకోని అధికారులు



రోడ్డుకంటే ఎత్తు నిర్మించిన సైడ్ డ్రైయిన్

సత్తుపల్లి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీలో అభివృద్ధి పనుల్లో విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. పట్టణంలో నివాస ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు గగ్గోలు పెడుతుంటే మరో పక్క ఇళ్లే లేని ప్రాంతాల్లో అధికారులు రోడ్డు మంజూరు చేసి తారురోడ్లు నిర్మించడం, అదే రోడ్డులో సిమెంట్ కాంక్రీట్ డ్రెయిన్ నిర్మింపజేశారు. డ్రైయిన్ నిర్మాణం కూడా అధికారుల పర్యవేక్షణ లేకుండా పనులు కాంట్రాక్టర్‌కే వదిలేయడంతో ఇష్టారాజ్యంగా పనులు సాగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇళ్లు లేని ప్రాంతంలో తారు రోడ్డు

మునిసిపాలిటీ పరిధిలోని గౌతమ్ మోడల్ స్కూల్ రోడ్డు నుంచి లింక్ రోడ్డును గతేడాది అధికారులు తారు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. పనులు కూడా పూర్తి అయ్యాయి. వందల మీటర్ల మేర నిర్మించిన తారు రోడ్డు పక్కన ఇళ్లు లేకపోవటం విమర్శలకు దారితీస్తోంది.

ఇదే రోడ్డుకు సైడ్ డ్రైయిన్ మంజూరు చేశారు. కాని గతేడాది నిర్మించిన తారు రోడ్డు ఎత్తు ఇప్పట్లో పెంచే అవకాశం లేదు. అయినా మంజూరు చేసిన డ్రైయిన్ ఇటీవల నిర్మించారు. రోడ్డు ఎత్తుకు మించి డ్రైయిన్ నిర్మించడంతో రోడ్డుపై చేరిన వరద నీరు డ్రైయిన్‌లోకి ఎలా చేరుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు సరైనా అంచనాలు వేసి డ్రైయిన్ డిజైన్ చేశారా లేక పర్యవేక్షణ లేకుండా నిర్మాణ బాధ్యతలు పూర్తిగా కాంట్రాక్టర్‌కే వదిలేశారా అనేది చర్చనీయాంశంగా మారింది. వాస్తవంగా వేంసూరు రోడ్డు నుంచి వచ్చే వరద నీరు ఈ ప్రాంతానికి చేరుతుంది. వర్షాకాలంలో వరద నీరు రోడ్డుపై నిలువ ఉండే పరిస్థితి ఉంది. నీరు డ్రైయిన్‌లో చేరకపోతే రోడ్డు శిథిలమయ్యే ప్రమాదం ఉంది. ముందు రోడ్డు నిర్మించి దాని కంటే ఎత్తులో డ్రైయిన్ నిర్మించడం వల్ల రోడ్డుపై నీరు ఎటు చేరుతుందనేది అధికారులకే తెలియాల్సి ఉంది. మొత్తంగా సత్తుపల్లి మునిసిపాలిటీలో అస్తవ్యస్తంగా జరుగుతున్న పనులకు ఇదో నిదర్శనంగా నిలుస్తోంది.

'రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలి'



మధిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మధిర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీపీఐ అనుబంధ రైతు సంఘం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మధిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మందడపు రాణి మాట్లాడుతూ రైతులకిచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. రుణమాఫీ, రైతుభరోసా విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. రూ. రెండు లక్షల లోపు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి ఏడాది కావస్తున్నా, రుణమాఫీకి పూనుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా అరకొరగా కాకుండా నూరు శాతం అమలుచేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, ధరణి విషయాల్లోనూ ప్రభుత్వం జాప్యం చేస్తుందని విమర్శించారు. దీంతో రైతులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, రహీం, మంగళగిరి రామానుజం, సిలువేరు శ్రీనివాసరావు, మచ్చా వెంకటేశ్వరరావు, రంగు నాగకృష్ణ, అప్పారావు, కొండ, సుజాత, రామారావు, నాగలక్ష్మి, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలి

» సీపీ సునీల్‌దత్



మహిళా కానిస్టేబుళ్లకు సూచనలు చేస్తున్న సీపీ సునీల్‌దత్

ముదిగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ముదిగొండ పోలీస్‌స్టేషన్‌ను సీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన హంగులతో ఆధునీకరించిన పోలీస్‌స్టేషన్‌ను, పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదవుతున్న క్రైమ్‌రేట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకొని కేసులు పెండింగ్ లేకుండా పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ మురళీ, ఎస్ఐలు గజ్జల నరేష్, అనంతరాములు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు భూసారాన్ని కాపాడుకోవాలి

» జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య



రైతులతో మాట్లాడుతున్న డీఏవో పుల్లయ్య

వైరా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలను భూమిలో కలియదున్ని భూసారాన్ని కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. మండలంలోని ఖానాపురం రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వివిధ పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి పలు సూచనలు చేశారు. దాచాపురంలో రైతులు కాలుస్తున్న వరికొయ్యలను పరిశీలించి దానివలన జరిగే నష్టాల గురించి వివరించారు. పూసలపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఏవో మయాన్ మంజూఖాన్, ఏఈవోలు సైదులు, వెంకటనర్సయ్య, ఎం.రాజేష్, వి.కీర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మధిర రూరల్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): మధిర శివారులోని మడుపల్లి గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం మాచినేనిపాలెం గ్రామానికి చెందిన ధరావత్ ఈశ్వర్ మడుపల్లి నుంచి మధిర వైపు ద్విచక్రవాహనంపై వస్తూ అదుపుతప్పి రోడ్డుపై కిందపడ్డాడు. క్షతగాత్రుడిని ఆర్కే ఫౌండేషన్ అధ్యక్షుడు దోర్నాల రామకృష్ణ వారి వాహనంలో క్షతగాత్రుడిని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు.

'ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి'

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేత చేయాలని పీవోడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో మహిళా యువజన సంఘాల జాయింట్ సమావేశంలో మాట్లాడుతూప్రయివేట్ ఆస్పత్రుల ఫీజులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆవుల మంగతాయి, కామేష్, వెంకటనరసమ్మ, పరిమళ, వెంకటమ్మ, పుల్లమ్మ, రాంబాబు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల అరెస్ట్ అప్రజాస్వామికం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అని టీయూసీఐ జిల్లా నాయకుడు ఏ.శరత్ అన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

'మొక్కలు నాటి సంరక్షించాలి'

తల్లాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించాలని పలువురు అధికారులు అన్నారు. తల్లాడలోని ముస్లిం కబరస్తాన్‌లో మంగళవారంలో మండల అధికారులు మొక్కలు నాటారు. పచ్చదనంలో భాగంగా కబరస్థాన్ చుట్టూ వివిధరకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, ఎంపీవో శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి



మధిరలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

మధిరటౌన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మధిర లో ఆపార్టీ నాయకులు కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ మొండితోక లత, నియోజకవర్గ ఇన్‌చార్జి కమల్‌రాజ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి శ్రీను, కనుమూరి వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను పాల్గొన్నారు.

సత్తుపల్లిలో...

సత్తుపల్లి, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తోందని సత్తుపల్లి మునిసిపల్ ఛైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మోనార్క్ రఫీ, దొడ్డా శంకరరావు, కోటగిరి సుధాకర్‌బాబు, వీరపనేని బాబీ, మల్లూరు అంకంరాజు, నరుకుళ్ల శ్రీను, ఎస్‌కే.చాంద్ పాషా, వల్లభనేని పవన్, నడ్డి ఆనందరావు పాల్గొన్నారు.



వేంసూర్‌లో....

కల్లూరులో...

కల్లూరు, డిసెంబరు 17 (ఆంధజ్యోతి) లగచర్ల రైతులపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి, బేడిలు వేసి నిర్బంధించిన ఘటనపై బీఆర్ఎస్ పిలుపు మేరకు కల్లూరులో మంగళవారం ఆ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, పెద్దబోయన మల్లేశ్వరరావు, యస్‌కె కమ్లి, మేకల కృష్ణ, కొరకొప్పు ప్రసాద్, సిహెచ్ కిరణ్ పాల్గొన్నారు.

వేంసూర్‌లో...

వేంసూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా వేంసూరులో ఆపార్టీ శ్రేణులు ఆందోళన చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కంటే వెంకటేశ్వరరావు, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, మారోజు సురేష్, మిర్యాల ప్రసాద్, ఎర్రా రమేష్, రహీం, రాందాస్, సింహాద్రిరాజు, మోరంపూడి శ్రీధర్, గాదె శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తల్లాడలో...

తల్లాడ, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ఉపయోగించి జైలులో నిర్బంధించటాన్ని నిరసిస్తూ తల్లాడలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, పట్టణ అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు కోడూరి వీరకృష్ణ, షేక్. యూసూబ్, రుద్రాక్ష బ్రహ్మం పాల్గొన్నారు.

పెనుబల్లిలో..

పెనుబల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో గిరిజనులపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం మండల బీఆర్ఎస్ నాయకులు వీఎంబంజర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.



కల్లూరులో...

సీఆర్టీల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి

ఏన్కూరు, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న సీఆర్టీల సర్వీసును క్రమబద్ధీకరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మూలపోచారం గిరిజన ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. సీఆర్టీల నిరవధిక సమ్మెకు యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ 20 ఏళ్లగా గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సీఆర్టీలకు సమానపనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రాంచంద్, యం.పుల్లయ్య, శ్రీదేవి, జె.పుల్లయ్య, నరసింహారావు, బి.శోభన్, శ్యామల, సింగ్యా శ్రీరాం,జె. నాగేశ్వరరావు, రమేష్, చందర్‌రావు, ఉషశ్రీ, సౌందర్య, కాంతయ్య, హరియా నాయక్, కపూరియా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు పుల్లయ్య మృతి



పుల్లయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రామనాథం

వైరా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వైరా మండల బీసీసెల్ అధ్యక్షుడు చిట్యాల పుల్లయ్య(57) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. గత 40సంవత్సరాల నుంచి టీడీపీలో చురుకైన నాయకుడిగా పనిచేస్తున్నాడు. వైరా సాయిబాబా మందిరంలో ఉంటూ సాయిబాబా సేవలో తరిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. పుల్లయ్య భౌతిక కాయాన్ని టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకూరి చలపతిరావు, మండల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కిలారు సురేందర్, మన్నేపల్లి ప్రదీప్, రాచబంటి కృష్ణయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు మందడపు మధుసూదన్‌రావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, మేదరమెట్ల పూర్ణచంద్రరావు, మద్దిని రామారావు, పొడపాటి నాగేశ్వరరావు, లగడపాటి బోస్, మాదినేని దుర్గాప్రసాద్ నివాళులర్పించారు.

ఎస్ఎఫ్ఐ కల్లూరు కమిటీ ఎన్నిక

కల్లూరు, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తెల్లూరి ప్రేమ్ కుమార్, కార్యదర్శిగా ఈలాప్రోలు మణికంఠను ఎన్నుకున్నారు. ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయిశేషు అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సత్యం, బొల్లం కార్తీక్, భాను, కృష్ణ, రవి తదితరులున్నారు.

'చెరువులు, కుంటల కింద నాట్లు వేయొద్దు'

కారేపల్లి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 41గ్రామపంచాయతీ పరిధిలోని చెరువులు, కుంటల కింద యాసంగి వరినాట్లు వేయొద్దని, అనుమతులు లేకుండా నాట్లు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్, ఇరుగేషన్ డీఈ వెంకన్న అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ యాసంగి నాట్లు వేయడం వలన నీటి స్థాయి తగ్గిపోయి తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రేమ, కరుణ ద్వారానే ప్రపంచ శాంతి

» అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ మల్లు నందిని

మధిర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏసు బోధించిన ప్రేమ, కరుణ, క్షమ ద్వారానే ప్రపంచంలో శాంతి, సుఖ సంతోషాలు చేకూరుతాయని అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ మల్లు నందిని తెలిపారు. మంగళవారం మధిరలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎంఈవో వై. ప్రభాకర్, పాఠశాల కరస్పాండెంట్ మేరీ థామస్, ప్రిన్సిపాల్ బేబీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలాగే భరత్ విద్యాసంస్థల్లోనూ జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మల్లు నందిని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి, కరస్పాండెంట్ విద్యాలత తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో ఎనోష్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సత్తుపల్లిలో ...

సత్తుపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రదర్ విజయప్రసాద్‌రెడ్డి క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అలవాల కరుణాకర్, బాలస్వామి, సత్యానందం, పింగలి సామేలు, రవికిరణ్ పాల్గొన్నారు.



మధిర సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మల్లు నందిని

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శాంతి, సమాధానం, ప్రేమను, నెమ్మదిని ప్రజలందరికీ కలుగజేయాలని ఏసుక్రీస్తు బోధనలు చెబుతున్నాయని ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ పీ.ఎనోష్‌కుమార్ అన్నారు. పాస్టర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ద్వారకాపూరి కాలనీలోని ఎల్‌బెతేల్ రివైవల్ చర్చిలో ఫ్యామిలీ సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిరీక్షన్, రూబేన్, ప్రేమ్‌రాజు, అరుణ్, సుందర్‌రావు, డేవిడ్‌రాజు, కొత్తపల్లి మేషక్, ఎబినేజర్, ఓనేసీంతో పాటు సేవకులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

వైరా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఉష్ణోగ్రతలు తగ్గిపోయి చలి విపరీతంగా పెరిగింది. మంగళవారం ఉదయం ఇక్కడ 16డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. తీవ్ర చలితో కూడిన ఈదురుగాలులతో జనం వణికిపోతున్నారు. చలిని తట్టుకోలేక వేకువజామున వివిధ పనుల కోసం వెళ్లేవారు రోడ్ల వెంట చలిమంటలు కాగుతూ చలి నుంచి సేదతీరుతున్నారు.



చలిమంట కాగుతున్న స్థానికులు

నిలిచిపోయిన పత్తి కొనుగోళ్లు



రహదారి వెంబడి బారులుతీరిన వాహనాలు

కారేపల్లి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో అధికారులు మంగళవారం నుంచి పత్తి కొనుగోలు నిలిపివేశారు. కేంద్రంలో పత్తి నిల్వలు అధికంగా ఉండడంతో కొన్ని రోజుల పాటు రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయకుండా నిలిపివేసినట్లు ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.రాంబాబు, కార్యదర్శి నరేష్ తెలిపారు. దీంతో వాహనాలు రహదారిపై పత్తి వాహనాలు బారులుతీరాయి.

ఎక్కడి చెత్త అక్కడే..

సత్తుపల్లిరూరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణానికి నలుదిక్కుల్లో ఏ దిక్కున చూసినా చెత్తనే దర్శనమిస్తుంది. ఖమ్మం వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా డంపింగ్ యార్డును తలపిస్తుండగా వేంసూర్ రోడ్డులో ఎన్టీఆర్ కాలనీ దాటిన తర్వాత ఓసీ వరకు ఇరువైపులా చెత్త డంపింగ్‌తో నిండిపోతుంది. అశ్వారావుపేట వైపు వెళ్లేదారిలో హడ్కో వాటర్ ట్యాంక్ వద్ద చెత్తాచెదారం ఏళ్లుగా పడవేస్తుండగా, కాకర్లపల్లి రోడ్డులోని గాడుదల వాగు బ్రిడ్జి వద్ద నిత్యం దుర్వాసన వస్తుంది. ఉదయం, సాయంత్రం వేళ్లల్లో వాకింగ్ చేసేవారితో పాటు రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, పందులు, వీధికుక్కలు, కోతులు చెత్తాచెదారం వద్ద వ్యర్థాల కోసం రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మునిసిపాలిటీతో పాటు ఆయా ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని జరిమానాలు వేస్తూ చెత్త పడవేసే వాహనాలను సీజ్ చేసి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకున్నట్లయితే ఈ సమస్య పురనారవృతం కాదని సమీప ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



వేంసూర్ రోడ్డులోని రోడ్డు వెంబడి చెత్తాచెదారం